# హాస్యానందం

24/6 Mile Stone

సంపూర్ణ హాస్య మాసపత్రిక ఆగష్టు-2026 ₹25







కార్టూన్
పోటీల ఫలితాలు

వివిధ సంస్కృతులలో
హాస్యం
దాని ప్రాముఖ్యత




**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548

# హాస్యానందం

24/6 Mile Stone

విడి ప్రతి రూ.25

ఆగష్టు-2026

24 వ సంవత్సరం ✦ 6 వ సంచిక

సం॥ చందా-రూ.300/- / 2 సం॥ చందా-రూ.600/-

జీవిత చందా-రూ.5000/-

ముఖచిత్రం: ప్రీతి ముకుందన్  కార్టూన్: గోపాలకృష్ణ

Editorial Office- Hasyanandam
#8-215/4, Near Ramalayam,
YERRABALEM-522 503,
Mangalagiri, Guntur Dist.
Ph:9849630636.
email: hasyanandam.mag@gmail.com
web: www.hasyanandam.com

*Prize Sponcers*

Yandamoori Veerendra Nath
K.V.V.Satyanarayana,
Akshagna Publications,
Nimmi Madhubala,
K.Sundaresayya& Satyavathi,
*Cartoonist* Md.Raj Mohammed,
*Cartoonist* Ramsheshu

**Hyderabad & Secunderabad Distributers**

**M.Pandu Ranga**
**Risingsun News Agency**
Abids, Hyderabad-1
Ph:9666680857,6301072906

*Publisher & Editor*

Ramu.P

*Well wishers*

Dr. K.V.Ramanachary,(IAS.Retd.)
Dr. K.I.Varaprasada Reddy,
Sri Tanikella Bharani
Sri K.V.V.Satyanarayana
Sri Akshagna Vidya Venkat
Dr. V.V.Rama Kumar

*Full pillar:* Bnim

*Cartoon Feature Editor:*
Bachi

*Creative Team*

Dr. K.Ramakrishna,
Sarasi, GopalKrishna,
Bomman, Nagisetty,
Krishna,Gandhi,
Dayakar, Venkat, Sangram,
Kandlakunta Sarath Chandra
Vadlamannati Gangadhar,

*D.T.P:* P.Rama Lakshmi,
9440304993

*Digital Media Director*
Surya


ఇంటిల్లిపాదినీ
నవ్వించేపని పెట్టుకున్న
ఏకైక హాస్య మాస
పత్రిక



## నవ్వుల చిరునామాలు...


**సీరియల్స్.....**

కొంగుచాటు కృష్ణుడు -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి -10
సినిమా తీద్దామా? -గొలుసు సీరియల్ -42

**కథలు.....**

బజ్జీలు తింటారా? కండ్లకుంట శరత్ చంద్ర -20
అసలుకే ఎసరు సి. హెచ్.ప్రతాప్ -32
సోలో బతుకే... పంతంగి శ్రీనివాస రావు -38
దయ్యం రాజశేఖరం కన్నోజు మనోహరాచారి -46

**శీర్షికలు.....**

ఈనెల ప్రోత్సాహక బహుమతులు -7-9
నవ్వులాట -గాంధీ మనోహర్ -28
స్మైల్ స్టార్స్ -వందన శ్రీనివాస్ -26
ఇండియన్ ఇంక్ -శ్రీ రవి రాణె -34
వెనక్కి వెళ్ళే కథలు -గంగాధర్ వడ్లమన్నాటి -36
పదానందం -పోపూరి విశ్వనాథ్ -50

**కార్టూన్ శీర్షికలు.....**

నవ్వుకొమ్మచ్చి -సరసి -12
హే భగవాన్ -భగవాన్ -13
మిక్చర్ పొట్లం -రామ్‌శేషు -22
ప్రొఫెషనల్ ఫన్ -నాగిశెట్టి -29
చిలుక జో(హా)స్యం -శాయికృష్ణ -31
పంచ్ ఫ్రేమ్ -కృష్ణ -37
నవ్వే మందు -ప్రసిద్ధ -40
బడాయి బాబులు -బొమ్మన్ -41
బుడ్డోడు -సుజయ్‌కృష్ణ -44
నెల నెల నవ్వుల వెన్నెల -48

బాచి కార్టూన్ పోటీ ఫలితాలు -14
సోమయాజుల శివరామయ్య, హైమవతిగార్ల స్మారక కార్టూన్ల పోటీ ఫలితాలు -17
వివిధ సంస్కృతులలో హాస్యం... దాని ప్రాముఖ్యత -24










**గమనిక:**

ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

**ఈ సంచికలో కార్టూనిస్టులు**

- సరసి
- రాజు
- బాచి
- శేఖర్
- బీవీఎస్
- బొమ్మన్
- గోపాలకృష్ణ
- కృష్ణ
- శాయికృష్ణ
- రామ్‌శేషు
- నాగిశెట్టి
- భగవాన్
- గాంధీ
- సుజయ్‌కృష్ణ
- టి.ఆర్.బాబు
- నాథ్
- ఓంకార్
- చక్రవర్తి
- శేషి
- క్రిష్
- శర్మ
- పి.పి.నాయుడు
- హరి
- ఆది
- ప్రసాద్ కాజ
- నాగ్రాజ్
- సునీల్
- దొరశ్రీ
- ప్రసిద్ధ
- అరుణ్
- వందన శ్రీనివాస్
- తోపల్లి ఆనంద్
- మోహన్ కుమార్
- లేపాక్షి
- అత్తలూరి
- శివకిషోర్
- ప్రేమ్
- పద్మ
- శిరి
- ఆనంద్‌గుడి
- గాయత్రి
- కృష్ణశ్రీ
- భాను
- కన్నాజిరావు
- అప్పాజికృష్ణ
- శ్రీధర్
- వర్చస్వీ
- సురేష్
- ఎమ్.రాము
- మహేష్

### పాటల పల్లకిలో...

"నిన్నలా... మొన్నలా లేదే... ఈ రోజు ఎందుకిలా!?"





# హాయ్...సానందంగా...


**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు... సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

**ఈ**మధ్య మనం తరచుగా 'క్రెడిట్ చోరీ' అనే మాట వింటున్నాం. ఒకరు చేసిన పనిని మరొకరు 'నేనే' చేశాను అని నిర్మొహమాటంగా చెప్పటం, అయిన వాళ్ళే కదా అని కొన్ని 'విషయాలు' పంచుకుంటే... ఆ 'అయిన వాళ్ళు' 'అవి' తమ ఆలోచనలే అని అందరిముందు గొప్పలు పోవటం... ఇది ఈ రోజు సర్వసాధారణమయిపోయింది. ఒకరి శ్రమ, ఆలోచన, విజయానికి సంబంధించిన పేరును మరొకరు దొంగిలించడం లేదా ఆ కీర్తిని తామే పొందేందుకు యత్నించడం. ఇది ఉద్యోగాల్లో, పరిశోధనల్లో, కళారంగాల్లో  ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ చోరి మరీ ఘోరంగా ఉంటున్నాయి.  ఉదాహరణకి ఒక కార్టూనిస్టు వేసిన కార్టూన్‌ని వేరేవరో తన సంతకంతో ఏ మాత్రం 'సిగ్గు' లేకుండా 'నా క్రియేషన్' అని పబ్లిక్‌గా పబ్లిష్ (సోషల్ మీడియాలో) చేస్తున్నారు. అలాగే కథల్లో కూడా ఒక మంచి 'వాక్యం' చదివి, తాము రాసే పుస్తకాల్లో తమ ప్రతిభగా రాస్తున్న దాఖాలలు ఎన్నెన్నో... మరీ ముఖ్యంగా మనం నలుగురితో పంచుకున్నమాటలు, విషయాలు (మనకి మాత్రమే తెలిసినవి) తర్వాత ఎప్పుడో ఆ నలుగురిలో 'ఒకడు' తనకి మాత్రమే తెలుసు అని మన ముందే వ్యక్తీకరించడం క్రెడిట్ చోరీ కి పరాకాష్ఠ!
ఆలోచనలు, ప్రతిభ దేవుడు ఇచ్చిన వరాలు. అవి దొంగిలించి 'నా ప్రతిభ' అని చెప్పుకునే ఈ 'దొంగలు' మన మధ్యే ఉన్నారు. మనం 'కష్టపడితే'... దానికి ఒక సలహా ఇచ్చినందుకు ఆ క్రెడిట్ అంతా నాదే అనే శూరులు కూడా కోకొల్లలు. ఎవరైతే 'ఎక్కడ' మన 'ప్రతిభ'ని, ఆలోచనల్ని దొంగిలించారో... 'అక్కడే' మనం నిజం చెప్పగలిగితే కొంతలో కొంత 'ఈ దొంగ'తనానికి అడ్డుకట్ట వేయవచ్చు! సో.... మన ఆలోచనలు ఎవరితో పంచుకోవాలి? ఎవరూ 'దోచు'కోకుండా ఎక్కడ 'దాచు'కోవాలి? అన్న విషయం కాస్త తెలివిగా ఆలోచించి మన ఆలోచనలు 'మనవే'... మనకే సొంతం అన్న భావం ఏర్పరచుకుందాం!
అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...



రాము.కి :

# రీ సౌండ్



✦ **కన్నోజు మనోహరాచారి, హైదరాబాద్**

**హా**స్యానందం జులై సంచికలో రాము గారు రాసిన సంపాదకీయం బాగుంది. ఈ ఎడిటోరియల్‌కు మరిన్ని అంశాలు జోడించి ఒక పాఠ్యాంశంగా రూపొందించి స్కూల్, కాలేజ్ విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ప్రస్తుతం నెలకొంది. పార్కుల్లో, కాలనీ సందుల్లో, చెట్లచాటున, గోడల చాటున ఆరవ తరగతి నుండి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు పిల్లలు. యువతులు ప్రేమ ఒకరితో, పెళ్లి ఇంకొకరితో ఎంజాయ్ చేయడం మరొకరితో... కళ్ళుండీ చూడలేని గుడ్డి సమాజంగా మారింది. సహజీవనాలను కోర్టులు సమర్థించడం విడ్డూరంగా వుంది. ఫోన్ ఎక్కువగా వాడొద్దని పిల్లలకు చెప్పే ధైర్యం ఈ రోజుల్లో తలితండ్రులకు లేదు. అందుకే రాము గారు రాసిన ఎడిటోరియల్‌కు కుటుంబ విలువల ప్రాధాన్యాన్ని తెలియచేసే మరిన్ని అంశాలను జోడిస్తూ, భావి జీవితం బాగుండాలంటే చదువు, ఉద్యోగం,పెళ్లి, పిల్లలు,వారి బాధ్యతలపై బోధించాల్సిన అవసరం ఉంది.

✦ **పి.వి. పద్మావతి మధు నివ్రితి,సికింద్రాబాద్**

**క**వర్ పేజీ అట్టపైన కార్టూన్ అద్భుతం, వినూత్నమైన ఆలోచన ... "రుణగ్రహీతలను నివారించడానికి తేదీని 1వ తేదీకి మార్చవద్దు"... గట్టిగా నవ్వాము.

హాయ్...సానందంగా లో రాముగారు బాగా సెలవిచ్చారు. విదేశీ పోకడాలనుండి విడాకులు నేర్చుకున్నారు భారతీయులు అనేటట్టు. కానీ గొడవపడే జంటకు విడాకులే శాస్త్రీయ పరిష్కారం. కుటుంబ సలహాదారులు మరియు సంతోషకరమైన అభివృద్ధి నిర్వహణ మరియు ఇరుపక్షాలకూ ప్రయోజనకరమైన విజయ పరిష్కారాల సలహాదారుల వద్దకు క్రమం తప్పకుండా వెళ్లండి... ఎలా మాట్లాడాలి, ఎలా జోక్యం చేసుకోకూడదు, ఎల్లప్పుడూ తప్పులు వెతికే ధోరణిలో కాకుండా పరిష్కారాల ధోరణిలో మాట్లాడాలి మొదలైన విషయాలపై మనం కౌన్సిలర్ల నుండి సలహాలు పొందవచ్చు.

బొమ్మన్ గారి 'బడాయి బాబులు' కార్టూన్ జోకు, మేలుకొలుపులా ఉన్నాది సమాజానికి (ద్వంద్వ ప్రభావం). అందరికి కావలసింది మంచి జీతంతో కూడిన ఉద్యోగాలు, అద్భుతమైన సామాజిక సంక్షేమ చర్యలు మరియు సంతోషకరమైన అభివృద్ధి. కానీ ఉచితాలు కాదు. ప్రజలకు, ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి వర్గాల వారికి ఈ విషయంపై అవగాహన కల్పించాలి. ధన్యవాదాలు.


హాస్యానందం సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్టూన్ పోటీలు

## పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక
## దసరా కార్టూన్ పోటీ!
## మాటల్లేవ్!... మాట్లాడటాల్లేవ్!

(క్యాప్షన్‌లేని కార్టూన్ పోటీ)



'జ్యోతిష విశారద' శ్రీ పాలపర్తి శ్రీకాంత్ శర్మ,
వారి తల్లి దండ్రుల స్మారకార్థం
ఈ పోటీని నిర్వహిస్తున్నారు.

₹10 వేలు ఒకో కార్టూన్‌కి 1000 రూపాయలు చొప్పున 10 బహుమతులు

ఈ **క్యాప్షన్‌లెస్** కార్టూన్ పోటీలో కార్టూన్లు సులభంగా అర్థమయి నవ్వొచ్చే వాటికే మొదటి ప్రాధాన్యత!
మరో ముఖ్య నిబంధన ఎలాంటి అక్షరాలు కార్టూన్లో కనబడకూడదు...
మీ సంతకం తప్ప!

కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ: సెప్టెంబర్-05, 2026

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-
hasyanandampoteelu@gmail.com

ప్రియమైన హాస్యానందం పత్రిక సంపాదకులకు,



మీరు పంపించిన ప్రశంసాపత్రం అందింది. ఎంతో ఆనందం కలిగించింది. **నా రచనా జీవితంలో నాకు అందిన ప్రశంసాపత్రాల్లో, దాదాపు నలభై సంవత్సరాల క్రితం లభించిన సాహిత్య అకాడమీ అవార్డు ప్రశంసాపత్రం తర్వాత మళ్లీ ఇంత ఆప్యాయంగా అందిన ప్రశంసాపత్రం మీదే.** అందుకే దీనికి నా మనసులో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. దీన్ని నేను భద్రంగా దాచుకుంటాను. అంత జాగ్రత్తగా ప్యాక్ చేసి పంపడం, ఎంతో అభిరుచితో రూపొందించిన ప్రశంసాపత్రం, మీరు చూపిన ఆప్యాయతకు నిదర్శనం. మీ అభిమానానికి, గౌరవానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

హాస్యానందం పత్రిక మరెన్నో సంవత్సరాలు విజయవంతంగా కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.


**–యండమూరి వీరేంద్రనాథ్**

మానవ మనుగడకు పర్యావరణం అత్యంత కీలకం. మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం అన్నీ పర్యావరణం నుండే లభిస్తాయి. వాటిలో ముఖ్యమయినవి చెట్లు! భూమిపై ఉష్ణోగ్రతలు సమంగా ఉండటానికి, వర్షాలు సకాలంలో పడటానికి అడవులు మరియు ప్రకృతి సమతుల్యత చాలా అవసరం. కలుషితం లేని పర్యావరణం మానవులకు మరియు ఇతర జీవులకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందిస్తుంది.

మానవ కార్యకలాపాల వల్ల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణం, భారీ కట్టడాలు, ఫ్యాక్టరీల కోసం అడవులను నరికివేయడం వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటోంది. పర్యావరణాన్ని కాపాడుకోవ డానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. ప్రతి వ్యక్తీ కనీసం కొన్ని మొక్కలనైనా నాటి వాటిని సంరక్షించాలి.

ప్రకృతిని మనం కాపాడితే, ప్రకృతి మనల్ని కాపాడుతుంది.







**'పర్యావరణానికి ప్రాణాధారం మొక్కలు'**
**ఈ అంశంతో కూడిన రెండు కార్టూన్లకు**
**శ్రీ యండమూరి వీరేంద్రనాథ్‌గారు**
**500 రూపాయలు చొప్పున**
**బహుమతి ఇస్తున్నారు.**




మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు

**ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**






'కార్టూన్ మిత్ర'

**శ్రీ కె.వి.వి. సత్యనారాయణగారు**

**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.

**అక్షజ్ఞ పబ్లికేషన్స్ వారు**

**ఒకో కార్టూన్‌కి**


**రూ.500/-లు చొప్పున**

**ఈ రెండు కార్టూన్లకు**

**1000 రూపాయలు**

బహుమతి ఇస్తున్నారు.










**శ్రీమతి నమ్మి మధుబాల (బాపు రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్) కార్టూన్ కళ పై ఆరాధనతో...**

**ఈ మూడు కార్టూన్లకు ప్రోత్సాహక బహుమతిగా (మూడు బహుమతులు) 1000 రూపాయలు ఇస్తున్నారు.**


మొదటి బహుమతి రూ.500/-లు




రెండవ బహుమతి రూ.300/-లు





మూడవ బహుమతి రూ.200/-లు







**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య, శ్రీమతి సత్యవతి వార్లు ఈ కార్టూన్‌కి** రూ.500/-లు బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్ **ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు** ఈ కార్టూన్‌కి **500 రూపాయలు** బహుమతిగా ఇస్తున్నారు.






ప్రముఖ కార్టూనిస్ట్ **శ్రీరామ్‌శేషు** తమ కుమార్తె **మోపురు పావని** జ్ఞాపకార్థం ఈ కార్టూన్‌కి రూ. 500/-లు బహుమతిగా ఇస్తున్నారు.









కథ-కథనం
**యండమూరి వీరేంద్రనాథ్**
**యర్రంశెట్టి శాయి**

**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండోవాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. సాత్వికరావు ఆత్మహత్య ప్రయత్నంలో లలిత దగ్గరకు చేరతాడు. ఆనందరావు రాధని పెళ్ళి చేసుకోవాలనే తలంపుతో ప్లాన్లు వేస్తున్నే క్రమంలో...

**ర**తీదేవి వాయుదేవుణ్ణి బ్రతిమాలి బ్యాంక్ ముందు దిగింది.

బ్యాంక్ బయటే ఉన్న ఓ మెడికల్ షాప్‌లోకి వెళ్ళి టెలిఫోన్ డైరెక్టరీ చూసి బ్యాంక్ మేనేజర్‌కి ఫోన్ చేసింది.

"హలో!" అన్నాడు బ్యాంక్ మేనేజర్.

"నేను ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి ఫైనాన్స్ సెక్రెటరీని మాట్లాడుతున్నాను."

"గుడ్ మార్నింగ్ మేడం!" అన్నాడు బ్యాంక్ మేనేజర్.

"నీకేమైనా బుద్ధుందా?"

"ఉంది మేడం! సారీ... లేదు మేడం!"

"మార్నింగ్ కాదు! గుడ్ ఆఫ్టర్నూన్.... చెప్పండి!...రోడ్డు మీద తిరిగే గూండాలకూ, సోమరిపోతులకూ, తాగుబోతులకూ తలో అయిదు వేలూ అప్పులిమ్మని... మేము తాఖీదు పంపించాం... అందలేదా?"

"అందింది మేడం!... అడిగినవారందరికీ ఒక్కొక్కరికీ ఐదువేలు అప్పిచ్చాం. సగం మంది తిరిగి ఇవ్వలేదు!... మిగతా సగం మందికీ ప్రభుత్వం మాఫీ చేసింది."

"అదే అతి వాగుడంటే!... ఒక్కసారి ఇస్తే సరిపోతుందా?... వారం రోజుల్లో తాగేశారు వాళ్ళు. ఇందాక మేము కనుక్కుంటే పాపం ఒక్కడి దగ్గర కూడా పైసా లేదు!"

"అలాగా మేడం! మాకు తెలీదా సంగతి."

"పిచ్చివాగుడు వాగకుండా... వెంటనే మీ స్టాఫ్‌ని నలుమూలలకీ పంపి వాళ్ళందరికీ ఇంకా ఏవేవో స్కీముల పేర్లు పెట్టి మళ్ళీ తలో అయిదు వేలూ అప్పివ్వండి."

"కానీ ఇప్పుడు బ్యాంక్ తెరిచి ఉన్నది కదా మేడం?"

"వెంటనే మూసి పారేయండి... వెంటనే మూయకపోతే అయిదు నిముషాల్లో మిమ్మల్ని పంజాబ్ బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫర్ చేయటం జరుగుతుంది." అని రిసీవర్ పెట్టేసి వెనక్కు తిరిగేసరికి బ్యాంక్‌కి తాళం కనిపించింది.

సాత్వికరావు ఆనందంగా స్కూటర్ మీద ఇంటికి వెళ్ళిపోతూ కనిపించాడు.

"ఇప్పుడేం చేస్తావ్ శచీ?!" అని తృప్తిగా నవ్వుకుంది రతీదేవి.

"సాత్వికరావు వెళ్లి... భార్యని కాపాడుకుంటాడు."

'పప్పులో కాలేసావ్ రతీ!' అనుకుంది ఇంద్రసతి.

"చేతులు కాలాక వెన్న రాసుకున్నావు."

సాత్వికరావు బ్యాంకు నుంచి ఇంటికి వస్తున్నాడు.

సరిగ్గా ఆ సమయానికి అతడి ఇంట్లో రాధ గడ్డం కింద రెండు చేతులు వేసి మొహాన్ని పైకి లేపి పెదవుల మీద గాఢంగా చుంబించబోతున్నాడు ఆనందరావు. తదాత్మ్యతతో ఆమె కళ్ళు మూసుకుని... భర్త(!) ఊపిరిని ఆస్వాదిస్తోంది.

అంతలో ఊహించని రీతిలో ఆమె మొహాన్ని వదిలేసి, అతను వెనక్కి అడుగు వేశాడు.

నిర్మలమైన కొలనులో రాయి వేస్తే... అలలు కదిలి ప్రశాంతత చెదిరినట్టు ఆమె కళ్ళు తెరిచింది.

అడుగు వెనక్కి వేసిన... ఆనందరావు నుదుటి మీద పిడికిలితో



కొట్టుకుంటూ...

"ఛీ! ఏమిటిది? ఏమనుకున్నాను?... ఏమి జరిగింది? సారీ రాధా... సారీ..." అన్నాడు.

రాధకి ఏమీ అర్థం కాలేదు.

ఏం మాట్లాడాలో తెలియనట్టు అతడి వైపు అయోమయంగా చూస్తూ ఉండి పోయింది.

"నేను మీ భర్త స్వాతిక్‌ను కాదు... జయ లక్ష్మి మొగుడు ఆనందరావుని."

రాధకు కోపం రాలేదు.

అతడి కళ్ళల్లో పశ్చాత్తాపాన్ని చూసింది.

"ఎందుకిలా చేశారు? ఎందుకు?" అని అడిగింది. ఆమె కంఠం రుద్ధమయింది.

"నన్ను ఏదో మైకం కమ్మేసింది. నాకే అర్థం కాని ఒక మాయ.నన్ను క్షమించండి. వెళ్ళొస్తాను" అంటూ ఉండగా అతడి దృష్టి టేబిల్ పై ఉన్న కత్తెర మీద పడింది.

"నిజంగా నాకేం తెలియదు రాధగారూ! ఏదో జరిగింది. ఏం జరిగిందో అర్థం కావట్లేదు... ఇక ముందు ఇలా జరగ డానికి వీల్లేదు!" అంటూ ఆమె ఊహిం చని రీతిలో, ఊహకందని వేగంతో ఆ కత్తెర తీసుకొని చెంప మీద చెవి దగ్గర గాటు పెట్టుకున్నాడు.


రాధ నిశ్చేష్టురాలై చూస్తూ ఉండగా, కారు తున్న రక్తానికి చెయ్యి అడ్డు పెట్టి...


"నా పొరపాటుకు ఇదే శిక్ష. మళ్ళీ మరో సారి మీరు పొరపాటు పడకుండా కూడా ఇదే మీకు గుర్తు!" అని అక్కడి నుంచి బయ టికి నడిచాడు.

పై నుంచి ఇదంతా గమనిస్తున్న శచీదేవి ఇంద్రుడుతో- "ఛీ!... ఏమిటిది? ఏం జరి గింది? మనం అనుకున్నది ఏమిటి? అక్కడ జరిగింది ఏమిటి? అతడు ఎందుకు అంత అకస్మాత్తుగా మారిపోయాడు? ఏమి చేశారు మీరు?" అని ప్రశ్నించింది.

"అతడి నిజాయితీ ముందు నా శక్తి నిల బడలేదు." తన ఓటమిని క్లుప్తంగా చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు ఇంద్రుడు.

భర్త వెళ్లిన వైపే చూస్తూ ఉండిపోయింది శచీదేవి.




ఒక మనిషి మంచి సంకల్పం ముందు ఒక దేవుడి దుష్టాలోచన ఓడిపోవడం ఆమెకు తెలిసినంతలో అదే మొదటిసారి. అయితే ఆమె నిరాశ చెందలేదు. ‘కడివెడు పాలు పాడు చేయడానికి చిన్న ఉప్పు పలుకు చాలు కదా...’ అనుకుంటూ అక్కడ ఏం జరుగుతోందా అని చూసింది.

ఇంటి ముందు సాత్విక్ స్కూటర్ ఆపుతున్న సమయానికి అప్పుడే ఆనందరావు తలుపు తీసి మెట్లు దిగుతున్నాడు.

అతనిని చూస్తూనే సాత్వికరావుకి షాక్ తగిలినట్లయింది... అచ్చం తన రూపంలో, అచ్చం తన లాగానే తనను ఆ రోజు బ్యాంక్‌లో రాధ చెంపదెబ్బ కొట్టిన దృశ్యం... అతని కళ్ళ ముందుకు వచ్చింది. తనను పోలిన వాడెవడో రాధను ఏదో చేయటం వల్ల రాధ తన చెంప పగల గొట్టిందని ఆ రోజే తనకు గట్టి నమ్మకం కుదిరింది. కానీ తన మాట అప్పుడెవరూ విని పించుకోలేదు. అతడా ఆలోచనల్లో స్థబ్దుడై ఉండగానే ఆనందరావు అతడిని గమనించకుండా దాటుకుని వెళ్ళిపోయాడు.

అతని వెనుకే తలుపు వేయటానికి వచ్చిన రాధని చూసి సాత్విక్ ఖంగు తిన్నాడు.

ఆఫీసు నుంచి అకస్మాత్తుగా అనుకోని సమయానికి వచ్చేసరికి... చీర నలిగి, జుట్టు చెదిరి, పెదవి ఎరుపెక్కి, బుగ్గ గాటెక్కిన భార్యని చూస్తే ఏ మగాడికైనా ఎలా ఉంటుంది?

ఎండా వానల మధ్య ఎన్నో వేల వర్షాలు తపస్సు చేసిన గౌతమ మహామునికే భార్య అహల్యను ఆ స్థితిలో చూస్తే కోపం ఆగలేదు. తనలాంటి పోలికలున్నవాడు వస్తే అందులో ఆమె తప్పేమున్నదని అనుకోలేదు. అరిషడ్వర్గాలను జయించి మనసుని అదుపులో పెట్టుకున్న ఋషీవలుడే “వే పోయి పాషాణ వేషంబు నొంది” అని శాపమిచ్చాడు.

‘గపటియై నీ రూపుఁ గైకొని ఇంద్రుఁడపరాధ మొనరించుట దియు నేనెఱుఁగ” దుఃఖముతో, భయముతో అంటుంది రంగనాథ రామాయణంలో అహల్య.

ఇక్కడ కూడా అలాగే జరిగింది గానీ, ఇది వేరే విధమైన వాదన!

“నీలాంటి వాడు మరొకడు ఉన్నాడని నీకూ తెలుసు. వాడొస్తే నేనేం చెయ్యను?” అంది.

“వచ్చి ఏం చేశాడు?” అనుమానంగా అడిగాడు సాత్వికరావు.

“వచ్చి...” ఇంకా ఆలోచిస్తూనే అంది.

సాత్వికరావు సస్పెన్స్ భరించలేక...


“ఆఁ...వచ్చి? ఏమయిందే? ఏం చేశాడు?” అన్నాడు ఆమె వైపు పరీక్షగా చూస్తూ.


“వచ్చి... ముద్దు పెట్టుకున్నాడండీ!”

“ఆఁ.. ముద్దు పెట్టుకున్నాడా? నువ్వెందుకు పెట్టుకోనిచ్చావు?” అని అరిచాడు.

“అయ్యో నాకేం తెలుస్తుందండీ?... మీరే వాడనుకొని... అహ... వాడే మీరనుకొని...”

“ఎవడో నా డూప్లికేట్ ఒకడు నాలా డబల్ యాక్షన్ చేస్తున్నాడని ఆ రోజు బ్యాంకులో నేను






చెప్తే విన్నావా?"

"అయ్యో! ఆ వచ్చింది ఆనందరావని నాకు తెలీదండీ!" అంది.

సాత్వికరావు అదిరి పడ్డాడు.

"ఏమిటీ? అంటే... అంటే... వాడి పేరు కూడా నీకు తెలుసన్న మాట? తెలిసీ ఈ వ్యవహారానికి ఒప్పుకున్నావన్నమాట!"

"ఒప్పుకోవటం ఏమిటి?... నిరాకరించటం ఏమిటి? ఏం మాట్లాడు తున్నారు?... అతను వచ్చాడు. నువ్వే అనుకున్నాను. దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టుకున్నాడు... కానీ అంతలో ఏమైందో ఏమో అకస్మాత్తుగా 'నేను తప్పు చేస్తున్నాను'... అనుకుంటూ వెళ్లిపోయాడు. అంతే జరిగింది."

"వచ్చాడు. ముద్దు పెట్టుకున్నాడు. అకస్మాత్తుగా మంచి వాడు అయిపోయాడు. లేచి 'సారీ' చెప్పి వెళ్ళిపోయాడు. బుద్ధున్నవాడు ఎవడన్నా ఈ మాటలు నమ్ముతాడా? ఎక్కడ పెట్టుకున్నాడే? బుగ్గమీదా? పెదాలు మీదా? నోట్లోనా?"

అప్పటికే రాధ మనసు కందిపప్పు మీద నీళ్ళలా కుత కుతా ఉడుకుతోంది. భర్త కాళ్ళు పట్టుకుని అహల్యలా బ్రతిమాల లేదు.

"ఏం? బుగ్గల మీద పెట్టుకుంటే పర్లేదా? పెదాలు మీద పెట్టుకుంటే శీలం పోయినట్టా?" అంది రోషంగా.

"రాధా! ఇంక డైలాగులనవసరం. మనిద్దరికీ ఈ క్షణం తో అన్నీ చెల్లిపోయాయి! నీ దారి నీదే. నా దారి నాదే!"

"అవేం మాటలండీ? నా తప్పు లేకపోయినా శిక్ష వేస్తా నంటారేమిటి?"

"మనం ఇక ఏం మాట్లాడినా ప్రయోజనం లేదు. విరి గిన మనసులూ, పగిలిన అద్దం ముక్కలూ మళ్ళీ అతుక్కో వని అద్దాల రిపేరు చేసే సాయిబు అన్నాడు. పూడ్చడానికి వీల్లేని అగాధం మన మధ్య ఏర్పడింది. నేను అలా వెళ్ళి పార్కులో ఓ అరగంట కూర్చుని వస్తాను... వచ్చేసరికి నువ్వూ, నీ సామానూ ఈ ఇంటి నుంచి వెళ్ళిపోవాలి!" అనేసి వెళ్ళి పోయాడు.


✦✦✦

"అయ్యో! రాధ శీలం పోకుండా ఆ సాత్వికరావుని అర్జెంటుగా ఇంటికి పంపించి కాపాడాను. కానీ ఇప్పుడతడు భార్యతో పేచీ పెట్టు క్కూర్చున్నాడు. ఇప్పుడెలా?" అంది రతీదేవి బాధగా.

"మనమే వెళ్ళి వాళ్ళకు నచ్చ చెబుదాం!" అన్నాడు కందర్పుడు.

ఆ ఆలోచన నచ్చి "సరే. పదండి" అంది రతి.

మరుక్షణంలో ఇద్దరూ సాత్వికరావు ఇంట్లో ప్రత్యక్షమయ్యారు. వాళ్ళు ఆకాశం నుంచి భూమ్మీదకి దిగే సమయానికే, భార్యాభర్తలిద్దరూ చిత్త కార్తె కుక్కల్లాగా దెబ్బలాడు కుంటున్నారు. **(సశేషం)**






## కార్టూన్ పోటీ ఫలితాలు



తొమ్మిదవ బాచి అవార్డు కార్టూన్లు పోటీకి ఈ సంవత్సరం ఈ రోజే కుంచె పట్టిన కార్టూనిస్టు నుండి అతిరథ సీనియర్ కార్టూనిస్టుల వరకు దాదాపుగా 70 మంది ఉత్సాహంగా పాల్గొని 320 కార్టూన్లు పంపడం జరిగింది. ఈసారి పోటీకి వచ్చిన కార్టూన్లన్నీ చాలా బాగున్నాయి. వాటిని సెలెక్ట్ చేయడం మా న్యాయ నిర్ణేతలకు తలకు మించిన భారమే అయ్యింది. కానీ ఈ పోటీలో మూడు ప్లస్ పది అంటే 13 కార్టూన్లే ఎంపిక చేయవలసి రావడంతో మంచి కార్టూన్లు కూడా వెంట్రుక వాసిలో బహుమతికి దూరం అవడం కొంచెం బాధగా ఉంది.

బాచి అవార్డుకి మన కార్టూనిస్టుల ఇస్తున్న ఆదరణకు నేనెప్పుడూ మీకు రుణపడి ఉంటాను. ఏ ఏటికి ఆ ఏడు ఈ ఆదరణ పెరుగుతూ రావడం ఆనందంగా ఉన్నది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి బాచి సోమయాజుల అవార్డులలో ఒక కార్టూనిస్టుకి ఒక బహుమతి అనే అంశం ప్రాతిపదికగా ఎక్కువ మంది కార్టూనిస్టులను గౌరవించాలి అనే ఉద్దేశంతో బహుమతులు ప్రకటించడం జరిగింది. గమనించగలరు.

ఈ రెండు పోటీలకు న్యాయనిర్ణేతలుగా నాతో పాటుగా శ్రీయుతులు హాస్యానందం రాముగారు, సోమయాజుల రమణగారు, రావెళ్ల గారు, పద్మదాసు గారు వ్యవహరించడం జరిగినది. సమయం కేటాయించిన వీరికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

ఈ రెండు పోటీలలో బహుమతులు పొందిన 23 మంది కార్టూనిస్టులతో పాటు పోటీలో పాల్గొన్న మిత్ర కార్టూనిస్టులు అందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేసుకుంటున్నాను.

**-బాచి**


### మొదటి బహుమతి రూ.5000/-లు పొందిన కార్టూన్




### రెండవ బహుమతి రూ.3,000/-లు పొందిన కార్టూన్



### మూడవ బహుమతి రూ.2000/-లు పొందిన కార్టూన్



## న్యాయ నిర్ణేత మాట!

హాస్యానందంలో బాచి గారు, ఎస్.వి.రమణ గారు, నిర్వహించిన కార్టూన్ల పోటీకి మంచి స్పందనే వచ్చింది. సుమారు 560 (రెండు క్యాటగిరిల్లో) కార్టూన్లు పోటీలకి వచ్చాయి.

కార్టూనిస్టులందరూ మంచి ఐడియాలతో గీసి పంపించారు. ఐతే కొన్ని నియమాలు పెట్టుకొని కార్టూన్లను ఒకటికి పదిసార్లు పరిశీలించి విజేతలను ఎంపిక చేసాము.

వడపోతల్లోని నాలుగు దశలను దాటుకొని నిలబడ్డ కార్టూన్లే బహుమతి పొందాయి. సీనియర్ కార్టూనిస్టులతో పాటు జూనియర్లు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

వ్యాఖ్యలకు, గీతలకు ఇంకా మెరుగు పెట్టుకోవలసిన అవసరం కనిపించింది. బహుమతిపొందిన వాటితోపాటు నాణ్యమైనవి కూడా ఉన్నాయి. ఐతే పోటీ నిబంధనలను దృష్టిలో ఉంచుకొని ఎంపిక చేయడం జరిగింది.

కార్టూనిస్టులందరూ నాకు మిత్రులే! బహుమతి రాలేదని చింతించవద్దు. మీ ప్రయత్నం ఎప్పటికీ ఆపకండి.


పోటీలో పాల్గొన్న వారికీ, విజేతలకు శుభాభినందనలు. ఇక ముందు కూడా ఇదే ఉత్సాహంతో పోటీల్లో పాల్గొంటారని ఆశిస్తూ.


–డా. రావెళ్ళ





**బాచి అవార్డు 2026, సోమయాజుల శివరామయ్య హైమవతి స్మారక కార్టూన్ పోటీ-2026...** ఈ కార్టూన్ పోటీలు విజయవంతం చేసిన కార్టూనిస్టు మిత్రులకు అభినందనలు. కార్టూనిస్టులను ఎంతగానో ప్రోత్సహిస్తున్న ఈ 'మిత్రద్వయం' శ్రీయుతులు బాచి గారు, ఎస్.వి. రమణ గారు క్రమంతప్పకుండా ప్రతియేట ఆగష్టు,15న ఈ బహుమతి ప్రదానోత్సవం నిర్వహించడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం! ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన కార్టూనిస్టు, కవి డా॥ రావెళ్ల గారికి, కార్టూనిస్టు శ్రీ పద్మదాస్‌గారికి ధన్యవాదాలు! విజేతలకు అభినందనలు! –సంపాదకులు


## జ్యూరీ బహుమతులు పొందిన ఒకో కార్టూన్‌కి రూ.500/-లు నగదు బహుమతి(10)




















## బహుమతి ప్రదానోత్సవ సభ

**ఆగష్టు,15 వ తేదీ, శనివారం,**
**సాయంకాలం 6గంటలకు.**
**విజయవాడ బందరురోడ్డులో**
**రాఘవయ్య పార్క్ ఎదురుగా ఉన్న**
**'బాలోత్సవ భవన్‌లో'**




## కార్టూన్ పోటీ ఫలితాలు

**ఒకో కార్టూన్‌కి**
**1000 రూపాయలు చొప్పున**
**10 బహుమతులు**




ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా నా తల్లీ తండ్రులైన సోమయాజుల శివరామయ్య, హైమవతిగార్ల స్మారక కార్టూన్ల పోటీ నిర్వహించటం జరిగింది.


పోటీలో కార్టూనిస్టులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 236 కార్టూన్లు పోటీకి వచ్చాయి. అందులో నుంచి ఒక పది కార్టూన్లు ఎంపిక చెయ్యటం కొంచెం కష్టమయినప్పటికీ న్యాయ నిర్ణేతలు వాటినుంచి ఉత్తమమైనవిగా భావించి సెలెక్ట్ చేయటం జరిగింది.


పోటీల్లో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు, విజేతలకు నా అభినందనలు తెలియజేస్తున్నాను. న్యాయ నిర్ణేతలుగా ఉన్న బాచి, దాసు, రావేళ్ళ గార్లకు మరియు హాస్యానందం రాము గారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అలాగే ఈ సంవత్సరం **సోమయాజుల శివరామయ్య, హైమవతి పురస్కారం** కు ఎంపిక అయిన శ్రీ శేఖర్ గారికి అభినందనలు తెలియజేస్తున్నాను. ఇప్పటిలాగే మీ అందరి సహకారం ముందు రోజులలో కూడా వుండాలని ఆశిస్తున్నాను.


**భవదీయుడు**


**రమణ సోమయాజుల, హైదరాబాద్. 9849666827**

























**శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి**
**పురస్కారం-2026 గ్రహీత-**
**ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీశేఖర్**


సుమారు 52 ఏళ్ళ నుండి కార్టూన్లు వేస్తున్న శ్రీశేఖర్ గారి మొదటి కార్టూన్ 1974 లో ఆంధ్రజ్యోతి పత్రికలో అచ్చయ్యింది. ఇప్పటిదాక సుమారు ఎనభైవేలకు పైగా కార్టూన్లు వివిధ పత్రికల్లో ప్రచురించబడింది. అన్నీ భారతీయ భాష పత్రికల్లో వీరి కార్టూన్లు ప్రచురించబడింది.



# హాస్యానందం అభిమాన చందాదారులకు గమనిక

మీ చందా నెంబరు

మీ చందా కాల పరిమితి




గత 24 సంవత్సరాలుగా హాస్యానందాన్ని అభిమానిస్తున్న మా ప్రియమైన చందాదారుల సౌలభ్యం కోసం కొన్ని మార్గదర్శకాలు రూపొందించడం జరిగింది. అవి...

- ప్రతినెలా 10 వతేదీ లోగా మీకు పత్రిక అందక పోతే... మీ కవరుపైనున్న మీ చందా నెంబరు తప్పనిసరిగా రాసి **95026 30637** నెంబరకు వాట్సాప్ మెసేజ్ మాత్రమే పంపండి!
- 15వ తేదీన మీ కాపీ మరల పోస్ట్ చేయడం జరుగుతుంది.



**వివరాల కోసం ఫోన్ చేయాల్సిన సమయం- పనిదినాలలో ఉ॥ 10 నుండి 12 వరకు; మ॥ 3 నుండి 5 వరకు**

## నవ్వుల నావి(య)కులకు మనవి

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక హాస్యానందం నవ్వుల నదిలో తమ కథలు, కార్టూన్లతో మన పాఠకులను విహరింపజేస్తున్న మా నావి(య)కులకు అభినందనలు తెలుపుతూ... రచయితలు,రచయిత్రులు, కార్టూనిస్టులు తప్పనిసరిగా తమ రచనలు, కార్టూన్లు **hasyanandam.mag@gmail.com** ఈ మెయిల్ కే పంపవలసినదిగా కోరుతున్నాం! కథల ప్రచురణకు మూడు నెలల వ్యవధి పడుతుంది. కార్టూన్లు ఏనెలకానెల ప్రచురిస్తాం కాబట్టి ప్రతి నెలా 15వ తేదీ లోగా పంపవలసినదిగా మనవి!

**దయచేసి వాట్సాప్‌లో కథలు, కార్టూన్లు పంపవద్దు!**



# బజ్జీలు తింటారా?

కంఢ్లకుంట శరత్ చంద్ర
+1(236) 516-1212

**కొత్తగా పెళ్లయిన వరుణ్‌కి ఒకే ఒక్క కోరిక. అది కూడా చాలా చిన్న కోరిక. బయట జోరుగా వాన పడుతుంటే... ఇంట్లో వేడివేడిగా, కారంగా ఉండే భార్య చేతి మిర్చి బజ్జీలు తింటూ, కాఫీ సిప్ చేయాలి.**

**“మన పేరులోనే వరుణ్, వర్ష ఉన్నాయి కాబట్టి వాన పడినప్పుడు నువ్వు నాకు వేడివేడి మిర్చి బజ్జీలు చేసి పెట్టాలి!” అని శోభనం గదిలోనే వర్షను అడిగాడు.**

**వర్ష కూడా సిగ్గుపడుతూ– “ఆహా!... తప్పకుండా అండీ!... మీరు అడగాలే గానీ, ప్లేట్లు ప్లేట్లు వడ్డించేస్తా!” అని ప్రామిస్ చేసింది.**

**కానీ... ఆ మిర్చి బజ్జీ తినడానికి వరుణ్ ఏకంగా ఒక యుద్ధమే చేయాల్సి వస్తుందని... పాపం ఆ అర్భకుడు ఊహించలేదు!**


కాలం తన వేగంతో తాను తిరుగుతూ మొత్తానికి వర్షాకాలన్ని మోసుకొచ్చింది.

వరుణదేవుడు, వరుణ్‌ను కరుణించి, ఒక రోజు సాయంత్రం ఆకాశం నల్లటి మేఘాలతో కమ్మేసింది. పెద్ద పెద్ద వాన చినుకులు పడటం మొదలయ్యాయి.

వరుణ్ ఆఫీస్ నుంచి రాగానే హ్యాపీగా గాల్లో తేలిపోతూ... “వర్షా! వాతావరణం అదిరి పోయింది. నువ్వు ప్రామిస్ చేసినట్టు ఆ మిర్చి బజ్జీలు వండి పెడితే, నేను వర్షాన్ని చూస్తూ తిని పెడతా!” అన్నాడు.

వర్ష కిచెన్‌లోకి వెళ్లి...డబ్బాలన్నీ వెతికి, బయటకొచ్చి బాధగా, “అయ్యో, ఏమండీ! ఇంట్లో పెద్ద పెద్ద మిరపకాయలు ఉన్నాయి కానీ... బజ్జీలు చేయడానికి మెయిన్ ఐటమ్ ‘శనగపిండి’ అయిపోయింది!” అంది.

వరుణ్ హతాశుడు అవుతూ... “అదేంటి! ఆ మధ్యనే కదా కిలో శనగ పిండి తెచ్చాను. ఏమయ్యింది?” అన్నాడు.




“ఆ మధ్య మీ ఫ్రెండ్ భోజనానికి వస్తే, శనగపిండి ఉల్లిపాయలు వేసి కూర చేసాను. గుర్తు లేదా?... బాగుంది చెల్లెమ్మా అంటూ, ఎగబడి మరీ తిన్నాడు ఫ్రెండ్!” అంది.

వరుణ్‌కు, ఆరోజు ఆమె ఏం చేసిందో గుర్తు రాలేదు. అయినా... “ఓహ్! అవును కదూ!” అన్నాడు.

“మరి ఇప్పుడెలా?” అంది వర్ష.

వరుణ్ నిట్టూరుస్తూ, “సరే, రేపు పొద్దునే తెస్తా!” అన్నాడు.

మరుసటి రోజు ఉదయమే పరిగెత్తుకెళ్లి, కిలో శనగపిండి ప్యాకెట్ తెచ్చాడు. కానీ ఏం లాభం? ఆ రోజు ఎండ దంచికొట్టేసింది! ఒక్క చుక్క వాన కూడా లేదు.

వరుణ్ శనగపిండి డబ్బా వైపు చూస్తూ వాన కోసం చాతక పక్షిలా ఎదురుచూడటం మొదలుపెట్టాడు.

ఎంతకూ నల్లమబ్బులు కానరాకపోయే సరికి వరుణ్,వరుణ దేవుడి కోసం జపం చేయ సాగాడు.

వరుణ దేవుడు వరుణ్ భక్తికి మెచ్చాడు.

మరో నాలుగు రోజుల తర్వాత... మళ్లీ సడన్‌గా వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో వాన స్టార్ట్ అయింది.

వరుణ్ ఎగిరి గంతేసి... “వర్షా! ఈసారి శనగపిండి రెడీగా ఉంది. ఇక ఆలస్యం వద్దు, బజ్జీలు లాగించేద్దాం... వేసి తీసుకురా!...” అన్నాడు.

వర్ష మళ్లీ కిచెన్‌లోకి వెళ్లి, కాసేపటికి మొహం చిన్నబుచ్చుకుని బయటకొచ్చింది.


“అయ్యో! ఏమండీ... మొన్న తెచ్చిన మిరప కాయలన్నీ నేను కూరలలో వేసేసాను. ఇప్పుడు ఇంట్లో పిండి ఉంది. కానీ, మిర్చి లేదు!” అంది.

వరుణ్ తల బాదుకున్నాడు.

“సరే... రేపు తెస్తా!” అని బాధగా వర్షం వంక చూసాడు.

మరుసటి రోజు మార్కెట్‌కి వెళ్లి బొద్దుగా, లావుగా ఉండే స్పెషల్ బజ్జీ మిరపకాయలు కేజీ కొనుక్కొచ్చాడు.

“అబ్బబ్బ! ఇద్దరి కోసం, మరీ కేజీ మిరప



కాయలు తెచ్చారా!" అంది వర్ష.

"ఏం ఫరవాలేదు! కొన్ని ఫ్రిజ్‌లో, కొన్ని డీప్ ఫ్రిజ్‌లో దాచి పెట్టు. ఈసారి ఆరు నూరైనా వర్షాన్ని చూస్తూ, నీ చేతి బజ్జీలు తినాల్సిందే!" అన్నాడు.

కానీ, ప్రకృతి వరుణ్‌తో ఆడుకుంది! ఆ రోజు నుంచి మళ్లీ వారం రోజుల వరకు ఆకాశంలో మేఘం ముక్క కూడా కనిపించలేదు. ఎండకి వరుణ్ తెచ్చిన మిరపకాయలు వాడిపోతాయేమోనని ఫ్రిజ్‌లో పెట్టి రోజుకోసారి చూసుకునేవాడు.

డీప్ ఫ్రిజ్‌లో ఉంచిన మిరపకాయలు గడ్డ కట్టి దెబ్బకు చచ్చి ఊరుకున్నాయి.

మిరపకాయలన్నీ బయటపడేసి, మళ్ళీ కిలో మిరపకాయలు తెచ్చాడు.

వర్ష తల బాదుకుంది.

'వర్షం' సినిమాను, 'వాన' సినిమాను రెండేసి సార్లు యూట్యూబ్‌లో చూసాడు. హిట్ సినిమాల్లో వచ్చిన వాన పాటలన్నీ చూస్తూ, వర్షం కోసం తహతహలాడి పోయాడు.

ఇంకొక వారం గడిచింది.


ఆ రోజు సాయంత్రం మళ్లీ మేఘాలు గుమిగూడాయి. వర్షం మొదలైంది. వరుణ్ అలర్ట్ అయ్యాడు. "వర్షా! ఇప్పుడు ఫ్రిజ్‌లో మిర్చి ఉంది, డబ్బాలో శనగపిండి ఉంది. ఇంకేం సమస్యలు లేవు కదా?... ప్రాసెస్ స్టార్ట్ చెయ్!" అన్నాడు ఉబలాటంగా.

"రెడీ గా ఉండండి. బజ్జీలతో వస్తా..." అని వర్ష కిచెన్ లోకి వెళ్లి, నూనె డబ్బా ఎత్తి చూసింది. అందులో సరిగ్గా రెండు చుక్కల నూనె ఉంది.

"ఏమండీ!... మిర్చి ఉంది... పిండి ఉంది... కానీ బజ్జీలు వేపడానికి 'నూనె' లేదు!" అంది నెమ్మదిగా.

వరుణ్ ఈసారి జుట్టు పీక్కున్నాడు.

"అయ్యో! బజార్‌కు వెళ్ళి నూనె తెస్తాను!" అంది వర్ష.




"నువ్వుండు! నేనే వెళ్లి తెస్తా!" అని వరుణ్ కోపంగా, పట్టుదలగా వర్షంలోనే రెయిన్ కోట్ వేసుకొని వేసుకుని బైక్ మీద బయలుదేరాడు. కానీ బయట రోడ్లన్నీ నీళ్లతో నిండిపోయాయి. విపరీతమైన ట్రాఫిక్ జామ్! ఒక పక్క వాన, ఇంకోపక్క హారన్ల గోల.

వరుణ్ నూనె ప్యాకెట్ కొని, ఆ ట్రాఫిక్ దాటుకుని, వరద నీళ్లలో బైక్ తోసుకుంటూ ఇంటికి వచ్చేసరికి రాత్రి పదకొండు గంటలు దాటిపోయింది.

అప్పటికే వరుణ్ ఆకలితో నకనకలాడి పోతున్నాడు, ఒళ్లంతా తడిసిపోయింది.


వర్ష జాలిగా చూస్తూ– "ఇంత రాత్రి పూట బజ్జీలు తింటే అరగవు. రేపు చేసుకుందాం లేండి!" అంది.


వరుణ్ ఏడుపుమొహం పెట్టి సరే అన్నాడు.


కానీ మర్నాడు ఎప్పటిలాగే ఎండ దంచి కొట్టింది!

ఇలా కాదు అని వరుణ్ ఒక పెద్ద ప్లాన్ వేసాడు.

ఇంట్లో మిర్చి, శెనగపిండి, నూనె, ఉప్పు, వాము అన్నీ పక్కాగా ఉన్నాయో లేదో ప్రతి






రోజూ చెక్ చేయడం మొదలుపెట్టాడు.

సరిగ్గా పదిహేను రోజుల తర్వాత... ఒక అద్భుతమైన శనివారం రోజు... ఆకాశానికి చిల్లు పడినట్టు వాన కురవడం స్టార్ట్ అయింది.

వరుణ్ కిచెన్ వైపు చూసి ఎగిరి గంతేసాడు.

"వర్షూ!... ఈ రోజు మన దగ్గర అన్నీ ఉన్నాయి. పిండి, మిర్చి, ఆయిల్... అన్నీ రెడీ! ఇక నీ టాలెంట్ చూపించు!" అన్నాడు.

"ఓకే అండీ! ఇప్పుడే వేడివేడిగా తెస్తా!" అని వర్ష స్టవ్ వెలిగించడానికి లైటర్ నొక్కింది.

టక్.. టక్.. టక్.. సౌండ్ వస్తోంది కానీ మంట రావడం లేదు.

వర్ష సిలిండర్ చెక్ చేసి తల పట్టుకుంది.

"ఏమండీ...గ్యాస్ అయిపోయింది!" అంది.

వరుణ్ గుండె ఆగినంత పనైంది.

"భగవంతుడా!... నా మిర్చి బజ్జీల మీద నీకెందుకంత పగ?" అని గట్టిగా అరిచాడు.

ఆ రోజు కూడా బజ్జీల కల కరిగిపోయింది.

ఓ రోజు వర్ష, వరుణ్ సినిమా థియేటర్లో ఉండగా వర్షం దంచి కొట్టింది.

బయటకు వచ్చేసరికి సూర్యభగవానుడు కనిపించాడు.

వరుణ్ ఏడుపు మొహం పెట్టాడు.

వరుణ్‌కు రాత్రి కలలో మిర్చీ బజ్జీలు తన ముందే డాన్స్ చేస్తూ కనిపించాయి.

వాటిని అందుకోవాలని వరుణ్ ప్రయత్నించాడు. అవి రివ్వున గాల్లోకి ఎగిరాయి. వరుణ్ వాటిని అందుకోలేక ఏడుస్తూ... రెండూ చేతులూ చాచి అరుస్తున్నాడు.

వర్ష అతడిని నిద్ర లేపి... "ఎందుకు ఏడుస్తున్నారు?" అంది.

"బజ్జీ... బజ్జీ..." అని అరిచాడు.

వర్ష అతని వంక జాలిగా చూసింది.

చివరికి ఒక రోజు... ప్రకృతి వరుణ్ మీద జాలిపడింది.

బయట తుఫాను రేంజ్‌లో వాన పడుతోంది. ఇంట్లో గ్యాస్ సిలిండర్ కొత్తది ఉంది, మిర్చి ఉంది, శనగపిండి ఉంది, నూనె ఉంది. అన్నీ పర్ఫెక్ట్‌గా ఉన్నాయి.

"ఈ రోజు ఎలాగైనా... మిర్చి బజ్జీ తినాల్సిందే!" అని వరుణ్ ఆర్డర్ వేసాడు.

వర్ష "సరే" అని కిచెన్‌లోకి వెళ్లి తలుపులు పెట్టుకుంది.

వరుణ్ హ్యాపీగా బాల్కనీలో కూర్చుని, వాన చినుకులను చూస్తూ....


"అబ్బా!... కాసేపట్లో వేడివేడి బజ్జీలు నా ప్లేట్లోకి వస్తాయి!" అని ఊహించుకుంటూ లాలాజలం ఊరించుకున్నాడు.

అరగంట అయింది...

ముప్పావు గంట అయింది...

గంట దాటిపోయింది!

కిచెన్ నుంచి ఘాటైన వాసనలు వస్తున్నాయి తప్ప బజ్జీలు బయటకు రావడం లేదు.



వరుణ్‌కి అనుమానం వచ్చి మెల్లగా కిచెన్ వైపు వెళ్లాడు.

తలుపు సందులోంచి లోపలికి చూశాడు.

అక్కడ సీన్ చూసి వరుణ్‌కి ఫ్యూజులు ఎగిరి పోయాయి!

వర్ష చేతిలో మొబైల్ పట్టుకుని... యూట్యూబ్‌లో... **'హౌ టు మేక్ మిర్చి బజ్జీ పర్‌ఫెక్ట్‌లీ ఫర్ బిగనీర్స్!...'** అనే వీడియో చూస్తోంది.

ఒక పక్క కడాయిలో నూనె పొగలు కక్కు తోంది. వర్ష, మిరపకాయను పిండిలో డాన్స్ ఆడించి, నూనెలో వేసింది.

అది బజ్జీలా కాకుండా ఏదో వింత ఆకారం (అమీబ లాగా) దాల్చింది. కొన్ని బజ్జీలు మాడి పోయి నల్లగా బొగ్గుల్లా ఉన్నాయి, కొన్నిటిలో పిండి ఉడకక పచ్చిగా ఉంది. కిచెన్ అంతా శనగపిండి ముద్దలు, నూనె మరకలు!

వర్ష ఏడుపు మొహం పెట్టి వరుణ్ వైపు చూసింది.

''అదీ... అదీ... ఏమండీ!... నాకు యూట్యూబ్‌లో చూసి వండడం రాదు. పెళ్లికి ముందు మా అమ్మ అన్నీ చేసి పెట్టేది. ఇన్ని రోజుల నుండి అది లేదు, ఇది లేదు అంటూ ఏదోలా నెట్టుకొచ్చాను. నాకు అసలు మిర్చి బజ్జీలు చేయడం రాదండీ! మీ కోరిక తీర్చాలని ట్రై చేశా... కానీ అన్నీ ఫెయిల్ అయ్యాయి!'' అని నిజం ఒప్పేసుకుంది.

వరుణ్ ఆ వింత ఆకారపు బజ్జీలను చూసి, నవ్వాలో ఏడవాలో తెలియక... తల పట్టుకుని కింద కూర్చుండిపోయాడు.

'దీని కోసమా నేను రెండు నెలల నుంచి వాన కోసం... వస్తువుల కోసం తపస్సు చేసింది?' అనుకున్నాడు.

దెబ్బకు వర్ష ఏడుపు లంకించుకుంది.

"అబ్బా! ఆపు..ఆపెయ్!" అన్నాడు.

వర్ష తన దొంగ ఏడుపు ఆపి, వరుణ్ వంక, "ఇప్పుడెలా?" అన్నట్టు చూసింది.

చివరికి వరుణ్ నవ్వుకుంటూ...

"సరే సర్లే! నువ్వేం కంగారు పడకు!" అని, గొడుగు వేసుకుని బయటకు వెళ్లి, వీధిచివర్లో బండి దగ్గర వేడివేడి మిర్చి బజ్జీలు... ఉల్లి పాయలు, నిమ్మకాయతో సహా కొనుక్కొచ్చాడు.

"భార్యచేతి బజ్జీ తినాలని కదా నా కోరిక! భార్య తయారు చేసే బజ్జీ తినే ప్రాప్తం లేదు. కనీసం...ఈ బజ్జీలైనా నువ్వు తినిపించు. ఇలా అయినా నా కోరిక తీరిందని సంతోషిస్తాను," అన్నాడు.

వర్ష ప్రేమగా తన చేతితో మిర్చీ బజ్జీలను వరుణ్ నోటికి అందించింది.

ఇద్దరూ హ్యాపీగా బాల్కనీలో కూర్చుని... ఆ కొనుక్కొచ్చిన బజ్జీలు తింటూ వానను ఆస్వాదించారు.

బజ్జీ తింటూ వర్ష వరుణ్ వైపు చూసి ముద్దుగా అంది– "ఏమండీ! వచ్చే యేడాది వానాకాలం వచ్చే సరికి, నేను పక్కాగా మిర్చి బజ్జీలు చేయడం నేర్చుకుని... మీకు నేనే చేసి పెడతాను... ప్రామిస్!" అంది.

ఆ మాట వినగానే వరుణ్ నోట్లోని బజ్జీ కాస్తా గొంతులో పడింది.

"బాబోయ్! వచ్చే వర్షాకాలం వరకు, నువ్వు చేసే బజ్జీల కోసం వేచి చూడాలా!" అని తూర్పు తిరిగి దండం పెట్టుకున్నాడు.


"కావాలంటే మరోసారి యూట్యూబ్ చూసి ప్రయత్నం చేయాలా?" అంది.

"వద్దు బాబోయ్ వద్దు! ఆ పరిశోధనలేవో, మనం రెండో గ్యాస్ సిలిండర్ కోసం అప్లై చేసాక చెయ్యి." అన్నాడు.


సరేనని తలూపింది వర్ష.

మొత్తానికి బజ్జీలగోల పక్కన పెట్టి, వర్షాన్ని ఆస్వాదిస్తూ కూర్చున్నారు.






**ప్రతినెలా హాస్యానందం అందంగా, సకాలంతో ముద్రించి మనకందజేస్తున్న 'రెయిన్‌బో ఆఫ్ సెట్ ప్రింటర్స్' అధినేత శ్రీ కె.నరేంద్రబాబు గారు, రమణీయంగా 'సావిత్రి క్లాసిక్స్' ముద్రించినందుకు–ఈ పుస్తకావిష్కరణ సభలో ఆం.ప్ర. డెప్యుటి స్పీకర్ శ్రీ రఘురామకృష్ణంరాజు, ప్రముఖ హాస్య నటులు శ్రీ బ్రహ్మానందం, ప్రఖ్యాత అందాల తార శ్రీమతి జయప్రద వారిని సత్కరించారు. మా నరేంద్రగారికి అభినందనలు.** **–సం॥**





# వివిధ సంస్కృతులలో హాస్యం... దాని ప్రాముఖ్యిత





ఏ.దయాకర్
Cartoonist & Animator

నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వలేకపోవడం ఒక రోగం అని పెద్దలు ఊరికే అనలేదు. అసలు మనుషులం అందరం ఒకేలా నవ్వుతాం కానీ, "ఎందుకు నవ్వుతాం? దేనికి నవ్వుతాం?" అనే దగ్గరే అసలైన ట్విస్ట్ ఉంది.

సైన్స్ పరంగా చూస్తే హాస్యం అనేది మన మెదడు ప్లే చేసే ఒక కెమికల్ గేమ్, కానీ సంస్కృతి పరంగా చూస్తే అది ఒక సామాజిక గ్లూ (జిగురు).

**హాస్యం వెనుక ఉన్న సైన్స్ (The Neuro-Science of Laughing)**

మన మెదడు ఒక అల్ట్రా-ఫాస్ట్ కంప్యూటర్ లాంటిది. ఎవరైనా ఒక జోక్ చెప్తున్నప్పుడు, మన మెదడు (Frontal Lobe) కథ ఎలా ముగుస్తుందో ఒక అంచనా వేస్తుంది. కానీ జోక్ చివర్లో మనం ఊహించని 'ఒక పంచ్ లైన్' వస్తుంది.

సైన్స్ దీన్ని 'Incongruity Theory" అంటుంది. అంటే ఊహించిన దానికి, జరిగిన దానికి మధ్య ఉన్న తేడాను మెదడు గుర్తించగానే... "అబ్బే, నేను తప్పుగా ఊహించానా!" అని షాక్ అయ్యి, ఆ కన్ఫ్యూజన్‌ను కవర్ చేయడానికి డోపమైన్, ఎండార్ఫిన్‌అనే హ్యాపీ కెమికల్స్‌ను విడుదల చేస్తుంది. అదే మన పెదవులపై నవ్వుగా మారుతుంది.

అంటే టెక్నికల్‌గా చెప్పాలంటే, జోక్ వినడం అనేది మన మెదడుకు జరిగే ఒక చిన్న కరెంట్ షాక్ లాంటిదన్నమాట!

హాస్యం అనేది ప్రపంచంలోని ప్రతి సమాజంలో కనిపించే ఒక విశిష్టమైన మానవ లక్షణం. అయితే ప్రజలు నవ్వే విధానం, జోకులను అర్థం చేసుకునే తీరు, హాస్యాన్ని ఆస్వాదించే పద్ధతి మాత్రం సంస్కృతి నుంచి సంస్కృతికి భిన్నంగా ఉంటుంది.


ఒక దేశంలో ఎంతో సరదాగా అనిపించే జోకు, మరొక దేశంలో అర్థం కాకపోవచ్చు లేదా అనుచితంగా కూడా భావించబడవచ్చు.

> **హాస్యం అనేది ప్రపంచంలోని ప్రతి సమాజంలో కనిపించే ఒక విశిష్టమైన మానవ లక్షణం. అయితే ప్రజలు నవ్వే విధానం, జోకులను అర్థం చేసుకునే తీరు, హాస్యాన్ని ఆస్వాదించే పద్ధతి మాత్రం సంస్కృతి నుంచి సంస్కృతికి భిన్నంగా ఉంటుంది. ఒక దేశంలో ఎంతో సరదాగా అనిపించే జోకు, మరొక దేశంలో అర్థం కాకపోవచ్చు లేదా అనుచితంగా కూడా భావించబడవచ్చు.**

వివిధ సంస్కృతులలో హాస్యాన్ని అధ్యయనం చేయడం ద్వారా వారి భాష, సంప్రదాయాలు, సామాజిక విలువలు, జీవనశైలి మరియు ఆలోచనా విధానం గురించి లోతైన అవగాహన ఏర్పడుతుంది.

**పాశ్చాత్య సంస్కృతులలో హాస్యం**
**(Western Culture - US & Europe)**

అమెరికా అనేక జాతులు, భాషలు, సంస్కృతుల కలయిక. అందువల్ల అక్కడి హాస్యం కూడా ఎంతో వైవిధ్య భరితంగా ఉంటుంది. అమెరికన్లకు హాస్యం అనేది ఒక 'ఎంటర్‌టైన్‌మెంట్ మరియు సెలబ్రేషన్' గా బావిస్తుంటారు. జీవితాన్ని ఉత్సాహంగా గడపడానికి వారు నవ్వును వాడు కుంటారు. అదే యూరోపియన్లకు హాస్యం అనేది ఒక 'కోపింగ్ మెకానిజం' (Coping Mechanism). అంటే జీవితంలో ఎదురయ్యే బాధలను, కష్టాలను తట్టుకోవడానికి


చైనా, జపాన్ వంటి దేశాలలో హాస్యం అనేది 'హార్మనీ' (సామరస్యం) కోసం వాడతారు.

వారు నవ్వును ఒక ఆయుధంగా వాడు కుంటారు. శైలి ఏదైనా, పాశ్చాత్య సంస్కృతిలో హాస్యం అనేది మానవ జీవితంలోని విభిన్న కోణాలను ఆవిష్కరించే ఒక అద్భుతమైన సాధనం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

అమెరికన్ సంస్కృతి సాధారణంగా 'విజయం','ఆశావాదం'(Optimism) చుట్టూ తిరుగుతుంది. వారి హాస్యం కూడా అలాగే ఉంటుంది. చాలా స్పష్టంగా, నేరుగా, బిగ్గరగా నవ్వించేలా ఉంటుంది. ఇక్కడ జోక్‌లు అర్థం చేసుకోవడానికి పెద్దగా బుర్ర బద్దలు కొట్టుకో వాల్సిన అవసరం ఉండదు.

అమెరికా, బ్రిటన్ మరియు యూరప్‌లోని అనేక దేశాలలో హాస్యం ప్రధానంగా ఈ లక్ష ణాలను కలిగి ఉంటుంది.

ఇక్కడ హాస్యం ఎక్కువగా వ్యంగ్య హాస్యం (Sarcasm) మరియు'సెల్ఫ్-డిప్రెసియేటింగ్' (తమను తాము తక్కువ చేసుకుని నవ్విం చడం) వ్యక్తిత్వ స్వేచ్ఛకు ప్రాధాన్యం, చమత్కార మైన సంభాషణలు, రాజకీయాలు, సామాజిక అంశాలపై వ్యంగ్య విమర్శ (Satire) మొదలగు వాటిపై ఆధారపడుతుంది.

**తూర్పు ఆసియా సంస్కృతి**


**(Eastern Culture - China & Japan)**

ఇక్కడ సీన్ రివర్స్! చైనా, జపాన్ వంటి దేశాలలో సమాజానికి, బంధాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. కాబట్టి, అక్కడ ఎవరినైనా అవమానించేలా లేదా తమను తాము మరీ తగ్గించుకునేలా జోకులు వేయడం తక్కువ. అక్కడ హాస్యం అనేది 'హార్మనీ' (సామరస్యం) కోసం వాడతారు. నవ్వు నలుగురిని కలపాలి కానీ, ఎవరినీ బాధించకూడదు అనేది వారి సైకాలజీ.

**వీటిలో ప్రధాన లక్షణాలు:** పదాలపై చమత్కారాలు (Wordplay), పరిస్థితులను ఆధారంగా చేసుకున్న హాస్యం (Situational Comedy), సమూహ భావనను పెంచే హాస్యం, ఇతరులను నేరుగా విమర్శించకుండా నవ్వించే పద్ధతిని పాటిస్తూ వుంటారు.

**జపనీస్ హాస్యం (Japanese Humor)**

జపాన్ ప్రజలు బయటి ప్రపంచానికి చాలా గంభీరంగా, క్రమశిక్షణతో కూడినవారిగా




కనిపిస్తారు. కానీ వారి లోపల అద్భుతమైన హాస్య కోణం ఉంది. జపనీస్ హాస్యం రెండు రకాలుగా సాగుతుంది.

ఒకటి అత్యంత సంప్రదాయబద్ధమైనది, మరొకటి అత్యంత వింతైనది.

**రకుగో** (Rakugo): ఇది దాదాపు 400 ఏళ్ల చరిత్ర గల ఒక జపనీస్ సాంప్రదాయ హాస్య కళ. ఇందులో ఒకే ఒక్క కళాకారుడు (రకుగోకా) కిమోనో ధరించి, మోకాళ్లపై కూర్చుని, కేవలం ఒకచిన్న పేపర్‌ఫ్యాన్ (విసన కర్ర) మరియు గుడ్డను మాత్రమే వాడుతూ, గొంతు మార్చి వేర్వేరు పాత్రలు పోషిస్తూ కథలు చెప్తాడు. ప్రేక్షకులను నవ్వించడమే దీని ముఖ్య ఉద్దేశం.

**ఓవరై మరియు మంజయ్** (Owarai & Manzai): ఆధునిక జపనీస్ టీవీలలో కని పించే స్టాండప్ కామెడీ ఇది.




ఇద్దరు వ్యక్తులు కలిసి చేసే ఈ కామెడీలో ఒకరు తెలివి తక్కువ పనులు చేసేవాడిగా, మరొకరు అతడిని సరిదిద్దుతూ తలపై కొట్టే తెలివైన వాడిగా (Tsukkomi) నటిస్తారు.

**గేమ్ షోస్** (Crazy Game Shows): జపనీస్ గేమ్ షోలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి.

శారీరక శ్రమతో కూడిన కఠినమైన, వింతైన టాస్క్‌లు ఇస్తూ ఆటగాళ్లను ఇబ్బంది పెడుతూ నవ్వించడం వీరి ప్రత్యేక శైలి.

**చైనీస్ హాస్యం**

**(Chinese Humor):**

చైనా సంస్కృతిలో హాస్యం అనేది కేవలం నవ్వించడానికి మాత్రమే కాదు, అందులో ఒక నైతిక సందేశం లేదా విజ్ఞానం దాగి ఉండాలి. కన్ఫ్యూషియస్(Confucianism) సిద్ధాం తాల ప్రభావం వల్ల ఇతరులను వ్యక్తిగతంగా కించపరచకుండా హాస్యాన్ని పండించడం ఇక్కడి ప్రత్యేకత.




**భాషా చమత్కారం:** చైనీస్ భాషలో ఒకే శబ్దం ఉన్న పదాలకు వేర్వేరు అర్థాలు ఉంటాయి. దీనిని ఉపయోగించి మాటల విన్యాసాలతో(Puns) చైనీయులు అద్భుతమైన హాస్యాన్ని సృష్టిస్తారు.

**క్రాస్ టాక్ లేదా క్షియాంగ్షెంగ్**

(Xiangsheng - Crosstalk):

ఇది చైనాలో అత్యంత ప్రజాదరణ పొందిన సాంప్రదాయ హాస్య ప్రదర్శన. ఇద్దరు కళా కారులు వేదికపై నిలబడి, ఒకరు ప్రశ్నలు వేస్తూ, మరొకరు సమాధానాలు ఇస్తూ... వేగ వంతమైన సంభాషణలు, పాటలు, మరియు నటన ద్వారా సామాజిక అంశాలపై వ్యంగ్యా స్త్రాలు సంధిస్తారు.

**(మరిన్ని సరదా సంగతులు వచ్చే సంచికలో)**



# స్మైల్ స్టార్స్ 26

## సెల్ఫీ

**వందన శ్రీనివాస్**

**అం**దరికీ శుభాభివందనములు! వందనశ్రీనివాస్ పేరిట కార్టూన్లు వేస్తున్న నా నిజం పేరు 'శ్రీనివాస్ కర్రి' మాత్రమే. అమ్మానాన్నలు కీ.శే.బ్రహ్మశ్రీ కర్రి భీమలింగాచారి, శ్రీమతిసరస్వతి. సొంతవూరు శ్రీకాకుళం జిల్లా 'టెక్కలి' గ్రామం. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి డిగ్రీ వరకు అక్కడే. ఉద్యోగరీత్యా 1988 నుంచీ వైజాగ్ లో వుంటూ 35 సంవత్సరాలు దెక్కన్ క్రానికల్‌లో పనిచేస్తూ జులై 2023లో అదే సంస్థలో అకౌంట్స్ మేనేజర్‌గా రిటైర్ అయ్యి, తదనంతరం SNF India Pvt Ltd లో చేరి ప్రస్తుతం ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను.

భార్యకు సముచిత స్థానం ఇచ్చినట్టు వుంటుందని తన పేరుకూడా జోడించి కార్టూన్స్ వేస్తున్నానంతే. కాకపోతే కార్టూనిస్ట్ మిత్రులంతా నన్ను నా పేరుతో కాకుండా వందన్‌గారూ అని పిలుస్తుండడం చూస్తుంటే పేరుకు కూడా నేను లేనా అని ఒక్కోసారి నవ్వుకుంటుంటాను.

కార్టూన్స్ నేను 7,8 చదివే రోజుల్లోనే పరిశీలిస్తూ, అప్పట్లోనే వెయ్యాలని తాపత్రయ పడేవాడిని. తొలి కార్టూన్ డిగ్రీ చదివే రోజుల్లో ఆంధ్రభూమి వీక్లీలో వచ్చింది. తరవాత్తరవాత కొన్ని సంవత్సరాలు వివిధ పత్రికల్లో ఎన్నో కార్టూన్లు వచ్చినా ఉద్యోగం ఒత్తిళ్లలో పడి చాలాకాలం వేయడం మానేసాను. మళ్లీ ఎఫ్.బీ, వాట్సాప్‌ల పుణ్యమా అని సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తూ కార్టూన్స్ వేయడం పునఃప్రారంభించాను.


2022లో వరసగా తలిశెట్టి అవార్డు, బాచి అవార్డు అందుకోవడం, దూరదర్శన్‌లో మన కార్టూనిస్టులు కార్యక్రమంలో 40 నిముషాలు నా పరిచయం ప్రసారం కావడం, 'గీతలు-రాతలు' శీర్షికన నా కథలూ, కార్టూన్లు, నఖచిత్రాలు కలిపి మల్టీ కలర్‌లో ముద్రించి పౌర గ్రంథాలయం, విశాఖపట్నంలో పెద్దలు, నా శ్రేయోభిలాషుల సమక్షంలో విడుదల చేయడం నా పూర్వ జన్మ సుకృతం. వివిధ కార్టూన్ కాంపిటిషన్స్‌లో పాల్గొని ఎన్నోసార్లు బహుమతులు అందుకున్నాను.


వృత్తి కన్నా కార్టూనిస్ట్‌గా నా ప్రవృత్తే నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది అని నేను చెప్తాను. తద్వారా ఎందరో పెద్దల పరిచయాలు, ఎందరెందరో ఆత్మీయులను పొందగలిగాను.

ఎంతో గాంభీర్యంగా వుండే పెద్ద పెద్ద వ్యక్తులు కూడా నా కార్టూన్లు చూసి చిన్న పిల్లల్లా మురిసిపోతూ నన్ను అభినందించడం నా అదృష్టం!


ఇవన్నీ ఎలావున్నా కార్టూనిస్టుల పాలిట కల్పతరువులా వుంటూ అందర్నీ ఒక దారంతో ఒక చోట గుదిగుచ్చి దండలా మలచి 'హాస్యానందం' పత్రిక ద్వారా తెలుగు కార్టూనిస్టులందరికీ గుర్తింపు ప్రసాదించింది మాత్రం నూటికి నూరుపాళ్ళు శ్రీరాముగారే అన్నది నా అభిప్రాయం. ఈ రోజున వారు నన్నిలా పరిచయం చేసినందుకు వారికి నా హృదయ పూర్వక ధన్యవాదములు.

మీ అందరికీ శుభాకాంక్షలు. **-మీ వందనశ్రీనివాస్.**




















ఓ పక్క తెలుగు మహా సభలంటారు - మరో పక్క స్కూల్లో తెలుగు మాట్లాడితే చితక్కొడతారు - సూపర్ కదరా!
SCHOOL



ఇదే నా మొదటి పెళ్లి తప్పక రావాలి బాబాయ్.., మరిచిపోవద్దు


మీకు ఆపరేషన్ చేసాం




భూమ్మీద మీకు నూకలు చెల్లాయండి. ఇకపై పుల్కాలు తినండి - సుగరుంది మీకు..


నే చాలా సిస్టమాటిక్‌గా ఉంటాను డాక్టర్ - నాకు రావటమేంటి ఈ జబ్బు!
కాబట్టే మీకొచ్చిందండి సిస్టమాటిక్‌గా ఉండేవారిని చూసి చూసి -


ఎవత్తండి ఇది.. మీ ఛెస్ట్ ఎక్స్‌రేలో


బాబాయ్!




## డబ్బు టు ది ఫవరాఫ్ సుబ్బు

**మిడిల్ క్లాస్ ఫ్యామిలీలో జన్మించిన గౌరవ సుబ్బుగారికి కోరికలు అనంతం. కానీ, ఆదాయం మాత్రం అంతంతే... దాంతో తన కున్న అభిలాషలు తీరకుండా అంతమైపోతానేమోనని సుబ్బు అప్పుడప్పుడూ ఆందోళన చెందేవాడు.**

సుబ్బు నాన్న ఏదో చిన్న ఉద్యోగం చేస్తూ ఇతగాడిని ఇంజినీరింగ్ వరకు చదివించాడు. ఆ దరిమిలా సుబ్బు తన టాలెంట్‌తో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాయిన్ అయి నెలకు పాతిక వేలు గడిస్తున్నాడు.

ఎప్పుడు వుంటుందో ఎప్పుడు ఊడుతుందో తెలీని తన జాబ్‌తో జర్నీ చేస్తున్నట్టు ఫీల్ అయ్యేవాడు సుబ్బు.

సుబ్బూకి మిడిల్ క్లాస్ లైఫంటే ఏవగింపు. డబ్బుని విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ, సోఫిస్టికేటెడ్ విల్లాల్లో ఉంటూ, విమానాల్లో విహరిస్తూ, పరదేశాల్లో పయనిస్తూ... కాస్ట్లీ లిక్కర్‌ని తాగుతూ... లైఫ్‌ని ట్వెంటీఫోర్ బై సెవన్ ఎంజాయ్ చేయాలనే ఆశ, ఆకాంక్ష, ఇచ్ఛ, తృష్ణ మొదలైనవి వున్నాయి... కానీ ఇవన్నీ ఫుల్ ఫిల్ అయ్యేది ఎలా? అని ఆలోచిస్తూ ప్రతి రోజు అర్ధరాత్రి వరకు నిద్రని దగ్గరకు రానిచ్చేవాడు కాదు.

ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే ఈ జీవితం ఎక్స్‌పైర్ అయిపోతుందని గ్రహించిన సుబ్బు, అందుకోసం ఓ మహత్తరమైన ప్రణాళికను రూపొందించుకున్నాడు.

వేలకోట్ల ఆస్తులున్న ఓ బిజినెస్ టైకూన్‌కు ఎవరైనా ఒకే ఒక్క కూతురు వుంటే, అలాంటి వాళ్ళని శోధించి... వాళ్ళలో ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఆ పిల్ల ఆస్తిని తను మనసారా అనుభవించాలన్నదే తన లక్ష్యం.

తన ప్లాన్ బావున్నా ఇది మెటీరియలైజ్ అవ్వాలంటే అంత వీజీ కాదని సుబ్బుకు తెల్సు... అందుకని మొత్తం తన ఫోకస్ అంతా తన 'లక్ష్యం' మీదే పెట్టాలని నిర్ణయించుకున్నాడు.

తన ఫ్రెండ్స్ దగ్గర అప్పు చేసి బ్రాండెడ్ బట్టలు, షూసూ, స్పెడ్సూ... ఇలాంటివన్నీ కొన్నాడు. పబ్బులకు, రేవ్ పార్టీలకు హాజర్ అవ్వడం మొదలు పెట్టాడు.

ఒకరోజు సిరి అనే అమ్మాయి పబ్బులో పరిచయం అయింది. ఆ పోరీ వేల కోట్లకు అధిపతి అయిన ఓ పెద్దాయన ఏకైక కూతురు... ఇక ఆలస్యం చేయకుండా వెంటనే ప్రేమించడం మొదలుపెట్టాడు... వారం రోజుల్లో తనకున్న లవ్ టెక్నిక్స్‌తో తను లేకుండా సిరీని ఉండలేని స్థితికి తెచ్చాడు సుబ్బు.

సుబ్బు, సిరి ఓ రెస్టారెంట్‌లో వున్నారు.

"మీ నాన్న మన ప్రేమని ఒప్పుకుంటాడా?" అని డౌట్‌ని వ్యక్తం చేశాడు సుబ్బు.


"ఒప్పుకోకపోతే లేచిపోదాం!" అని అంది సిరి వైన్‌ని తాగుతూ.

సిరి ఆ మాట అనడంతో సుబ్బుకు తమ లవ్ మీద వున్న కాన్ఫిడెన్స్ అందలం ఎక్కి కూర్చుంది.

సిరీని తను పెళ్లాడాక... భవిష్యత్తులో తన విలాసవంతమైన జీవన శైలి ఎలా వుంటుందో ఊహించుకుని సుబ్బు పరవశించి పోయాడు.

అర్ధరాత్రి అవుతుండగా సిరి తన రోల్స్ రాయిస్ కారులో సుబ్బుని అతని రూమ్ దగ్గర డ్రాప్ చేసి వెళ్ళిపోయింది.

సుబ్బు తన రూమ్ దగ్గరకువచ్చి చూస్తే...





అక్కడ ఓ ఆరుమంది రౌడీలు వున్నారు.


వాళ్ళ చేతుల్లో కత్తులూ,సైకిల్ చెయిన్లు వున్నాయి.

'ఎవరు మీరు?' అని వాళ్ళని సుబ్బు అడిగే లోపు వాళ్ళల్లో ఒకడు–

"రేయ్ సుబ్బిగా!... నువ్వు సిరి అనే అమ్మాయిని లవ్వు చేయడం మానుకో! లేదా నీ ఫ్యామిలీ మెంబర్స్‌కు నీ శవం కూడా దొరక్కుండా చేస్తాం!" అని అన్నాడు.

ఇంతలో మరొక రౌడి "రేయ్ గూట్లే!... నువ్వు సిరి ప్రేమించడం వాళ్ళ అన్నయ్యకు




బొత్తిగా ఇష్టం లేదు. నిన్ను చంపేసి రమ్మని మాకు పాతిక లక్షలు ఇచ్చాడు. నిన్ను చూస్తే మాకు చంపబుద్ధి కావడం లేదు... నిన్ను చంపేశామని వాడికి అబద్ధం చెబుతాం... రేపటినుండి సిరీకి కనిపించొద్దు" అని హెచ్చరిక చేసి వెళ్లి పోయారు ఆ రౌడీలు.

బతికుంటే మరో సిరీని ప్రేమించొచ్చు అని రియలైజ్ అయిన సుబ్బు, ఆ రౌడీలు చెప్పినట్టే చేశాడు.

తన ఫోన్ నెంబర్ కూడా మార్చేసి ప్రియురాలు సిరికి గుడ్ బై చెప్పేశాడు.

కొన్ని రోజుల తర్వాత... ఓ రేవ్ పార్టీకి వెళ్ళాడు.

అక్కడ 'సంపద' అనే అమ్మాయి పరిచయం అయింది. ఆ పిల్ల కూడా ఓ మిలియనీర్‌కు ఒక్కగానొక్క కూతురు... ఈ విషయాన్ని తన కున్న కుశాగ్రబుద్ధితో వెంటనే తెల్సుకోగలిగాడు సుబ్బు.

ఇకేమీ ఆలస్యం చేయకుండా సంపదను ప్రేమించడం మొదలు పెట్టాడు సుబ్బు.

సంపద కూడా అనతి కాలంలోనే సుబ్బు ప్రేమకు దాసోహం అయిపోయింది. సుబ్బు లేని జీవితం వ్యర్థం అనే స్థితికి వచ్చేసింది.

ఇది గ్రహించిన సుబ్బు తన అదృష్టానికి హాట్స్‌ఆఫ్ చెప్పుకున్నాడు.

సిరీని దూరం చేసుకున్నందుకు.... సుబ్బు అప్పుడు పడ్డ బాధ, వేదన, క్లేశం ఇప్పుడు 'సంపద'తో అవన్నీ కనుమరుగై పోయాయి.

నెలరోజుల పాటు సుబ్బు, సంపద ప్రేమే లోకం అన్నట్టు గడిపారు.

ఇలా వుండగా ఒకరోజు సుబ్బు దగ్గరకు జీతు అగర్వాల్ అనే వ్యక్తి వచ్చి–

"రేయ్!... నాకూ సంపదకు వివాహం ఫిక్స్ అయింది... వచ్చే నెలే మా మ్యారేజ్... నేను పని వుండి లాస్ట్ వీక్ అమెరికా వెళ్ళాను. సంపద ఆ విషయం మర్చిపోయి... నిన్ను ప్రేమించిందట. ఇక సంపదను మర్చిపో!... సంపద నాది. నువ్వు లేదూ... కాదూ... అంటే ఓ కోటి రూపాయలు నావి కావనుకుంటే నీ మెడ మీద తలకాయ లేకుండా చేయడం నాకు పెద్ద టాస్క్ కాదు." అని స్ట్రాంగ్ అండ్ హాట్ వార్నింగ్ ఇచ్చి తను వచ్చిన ఫెరారీ కారులో వెళ్ళిపోయాడు.


ఈ బెదిరింపుతో ఫుల్ డల్ అయిపోయాడు సుబ్బు.

ఇంతలో సంపద ఫోన్ చేసి సంప్లేస్‌లో కలుద్దామని చెప్పింది.

'సరే' అని ఆ సంప్లేస్‌కు వెళ్ళాడు సుబ్బు.

అక్కడికి సంపద వచ్చింది.

"ఆ జీతు అగర్వాల్‌కు రోజూ...చాలా తల వెంట్రుకలు రాలి పోతున్నాయి. కాబట్టి వాడికి తొందర్లో బట్టతల వచ్చేస్తుంది... ఆ బట్టతల వాడితో నేను కల్సి జీవించలేను. ఈ విషయం



మా ఇంట్లో వాళ్ళకు చెబితే వాళ్ళు దాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. అందుకే ఆ జీతూ అగర్వాల్ గాడిని రేపు ట్రెక్కింగ్‌కని చెప్పి... లోహగడ్ కోటకు తీసుకొస్తా ... వాడ్ని అక్కడే లోయలో ఇద్దరం కల్సి తోసేద్దాం!... కాలు జారి పడిపోయాడని నేను అందర్నీ నమ్మిస్తా. ఆ తర్వాత మనిద్దరం జబర్దస్త్‌గా పెళ్లి చేసుకోవచ్చు... ఎలా వుంది నా మాస్టర్ ప్లాన్?" అని అంది సంపద తనని తాను తెలివైన దానిలా ఊహించుకుంటూ.

"అలా చేస్తే తప్పకుండా దొరికిపోతాం సంపదా!" అని అనునయంగా అన్నాడు సుబ్బు.


"దృశ్యం సినిమాలో వెంకటేష్ దొరికాడా?" అని అంది సంపద.

" అది సినిమా సంపదా!...వాళ్ళు హీరోని ఎలివేట్ చేయడానికి కథలలా రాస్తారు..." అని... ఎంతో చెప్పి చూశాడు సుబ్బు.

కానీ సుబ్బు చెప్పే పర్యవసనపు పరిస్థితుల్ని ఆలకించే స్థితిలో సంపద లేదు.

"ఇదిగో సుబ్బూ!... నేను నీకు కావాలంటే నన్ను కన్విన్స్ చేయాలని చూడకు... రేపు సాయంత్రం ఎయిర్ పోర్ట్‌కు వచ్చేయ్. నేనూ అగర్వాల్ వెళ్ళే ఫ్లైట్‌లో నువ్వూ కూడా మాతో వచ్చేద్దువు... నీకు కూడా ఫ్లైట్ టికెట్ బుక్ చేస్తాను." అని అక్కడి నుండి వెళ్ళిపోయింది.

సుబ్బు మరుసటి రోజు ఎయిర్ పోర్ట్‌కు వెళ్ళలేదు.




సంపద కాల్ చేస్తే సుబ్బు లిఫ్ట్ చేయలేదు.


ఆ తర్వాత సంపదకు కూడా సుబ్బు కాల్ చేయలేదు.

దీంతో సుబ్బూకు సిరి సంపదలు ఇద్దరూ దూరం అయిపోయారు.

అయినా తన ఆశయ సాధన కోసం...మరో అమ్మాయి కోసం తీవ్ర ప్రయత్నాలు మొదలు పెట్టాడు.

ఒకరోజు ఓ వినీల తన కారు పక్కన నిలబడి ఫోన్ మాట్లాడుతోంది. ఇంతలో ఓ దొంగ వచ్చి ఆమె ఫోన్ లాక్కొని పారిపోయాడు.

అక్కడే వున్న సుబ్బు వాడ్ని వెంబడించి పట్టుకుని వాడి దగ్గర నుండి వినీల ఫోన్ తీసుకుని ఆమెకి తెచ్చి ఇచ్చాడు.




"ఇది మాఅమ్మ నాకు కొనిచ్చిన ఫోన్... దీనితో నాకు ఎమోషనల్ బాండింగ్ వుంది." అని సుబ్బు చేసిన సాయానికి... వినీల తన కృతజ్ఞత వ్యక్తం చేస్తూ పక్కనే వున్న కాఫీ షాప్‌కు తీసుకెళ్ళి అతనికి టీ తాగించింది.

అంతటితో ఆగకుండా సుబ్బూని వినీల లవ్ చేయడం మొదలు పెట్టింది.

తర్వాత ప్రియుడు సుబ్బూని వినీల తమ మ్యాన్షన్ హౌస్‌కి తీసుకెళ్ళింది.

బిజినెస్ టైకూన్ జానీకపూర్‌కు వినీల ఒక్కగానొక్క కూతరనీ లక్షల కోట్లకు వారసురాలనీ అక్కడ యాంబియన్స్‌ని బట్టి సుబ్బూకి క్లియర్‌గా అర్థమైంది.

దీంతో వినీలాను సిన్సియర్‌గా లవ్ చేయడం మొదలు పెట్టాడు.

కొన్ని రోజుల తర్వాత సుబ్బూని వినీల తన నాన్న జానీకపూర్‌కి పరిచయం చేసింది.

మరుసటి రోజు సుబ్బూని వినీల వచ్చి కల్సి

"సుబ్బూ డాళింగ్! మనిద్దరం ప్రేమించుకుంటున్నట్టు మా డాడీతో చెప్పాను..." అని వినీల అంది.

"ఏమన్నారు?" ఆత్రుతగా అడిగాడు సుబ్బు.


"నీ ఇష్టమే నా యిష్టం... అని అన్నారు." అని ఉల్లాసంగా అంది వినీల.

ఆ ఆనందంలో వినీలను సుబ్బు హగ్ చేసుకున్నాడు.

వినీల వాళ్ళ నాన్నకు సుబ్బూని పెళ్లి చేసుకోవడంలో అభ్యంతరం లేదు. గతంలో వినీలకు



# చిలుక జో(హా)స్యం




ప్రేమలు, నిశ్చితార్థాలు లేవు కాబట్టి గొడవలు జరగడానికి ఆస్కారం లేదు. సో...సిరి సంపద లాగా ఈ లవ్‌కు అభ్యంతరాలు, అడ్డంకులు ఉండవని భావించి... పులకించి పోయాడు సుబ్బు.

ఇలా వుండగా ఎవడో సుబ్బు బ్యాంకు అకౌంట్‌లో లక్షా ఇరవై మూడు వేలు పొర పాటుగా వేసేశాడు.

ఆ డబ్బు వేసిన గోరాలాల్ అనే వోడు నోయిడా నుండి సుబ్బుకి ఫోన్ చేసి...

"తను పొరపాటుగా వేశానని, దాన్ని తిరిగి తనకి పంపేయమని హిందీలో రిక్వెస్ట్ చేసుకు న్నాడు.

నిజానికి సుబ్బుకి హిందీ వచ్చినా రానట్టు తెలుగులో మాట్లాడి కాల్ కట్ చేసేశాడు.

గోరాలాల్ మళ్ళీ మళ్ళీ కాల్ చేసి అందులో కనీసం లక్ష రూపాయలైనా తనకి పంపమని తన బాధలన్నీ చెప్పుకున్నాడు.

అయినా సుబ్బు కనికరించలేదు.

చివరికి ఆ గోరాలాల్ నెంబర్ బ్లాక్ చేసే శాడు సుబ్బు.

ఆ తర్వాత వారం రోజులైనా... గోరాలాల్ వేరే నెంబర్ నుండి కూడా సుబ్బుకి ఫోన్ చేయలేదు.

ఆ గోరాలాల్ తను డబ్బు మీద ఆశ వదులుకున్నాడని సుబ్బుకి అర్థమై పోయింది.



దాంతో సుబ్బు షాపింగ్‌మాల్స్‌కు వెళ్లి ఆ డబ్బుతో ఏవేవో కొనేశాడు.

వినీలను కలుద్దామని షాపింగ్‌మాల్ నుండి కాల్ చేశాడు సుబ్బు.

వినీల ఫోన్ లిఫ్ట్ చేసి కోపంగా...

"ఇంకెప్పుడూ నాకు ఫోన్ చేయద్దు!" అని కాల్ కట్ చేసింది.

మళ్ళీ ఫోన్ చేశాడు.

"ఎందుకు వినీలా?... నేను ఏం తప్పు చేశాను. చెప్పు!" అని అర్థం కాక అడిగాడు సుబ్బు.

"పరాయివాళ్ళ సొమ్ముని ఆశించే నీలాంటి వాళ్ళంటే నాకు పరమ అసహ్యం." అని అంది వినీల డైరెక్ట్‌గా పాయింట్‌కు రాకుండా.

" పరాయి సొమ్మా!... ఏం అంటున్నావో నాకు అర్థం కావడం లేదు." అని అన్నాడు.

"నీ బుద్ధి ఎలాంటిదో తెల్సుకోడానికి... నోయిడా నుండి గోరాలాల్ చేత నీ అకౌంట్ లో డబ్బు వేయించింది మా నాన్నే!... పరాయి సొమ్ము ఆశించే నువ్వు రేపు నా ఆస్తి విషయం లో కూడా ఇలా చేయవని గ్యారంటీ ఏంటీ?" అని నిలదీసింది వినీల.

దానికి సుబ్బు దగ్గర సరైన సమాధానం లేదు. దాంతో సైలెంట్ అయి పోయాడు.



"అన్నం వుడికిందో లేదో తెల్సుకోడానికి అన్నం మొత్తం తినాల్సిన అవసరం లేదు..." అనే సామెతను మా డాడీ నీమీద అప్లై చేశాడు. నువ్వు అడ్డంగా దొరికిపోయావ్. గుడ్ బై!!" అని కాల్ కట్ చేసింది వినీల.

వినీలకు ఏదో ఒకటి చెప్పి కన్విన్స్ చేద్దామని వెంటనే కాల్ చేశాడు.

కానీ తన నెంబర్‌ని వినీల బ్లాక్ చేసినట్టు సుబ్బుకి తెల్సి ఆవేశంగా తన ఫోన్‌ని నేలకేసి గట్టిగా కొట్టాడు.

అది నాలుగు ముక్కలై... ఓ ముక్క వచ్చి సుబ్బు మొహానికి గట్టిగా తగిలింది. ఆ నొప్పికి 'అబ్బా!' అని మూలిగాడు అష్ట నష్ట దరిద్రుడైన సుబ్బు.

# అసలుకే ఎసరు

సి.హెచ్. ప్రతాప్,
98660 71785

**అప్పల్రాజు అలియాస్ ఆపిల్ రాజు అమలాపురంలో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అంటే మైక్రోసాఫ్ట్ కంపెనీలో కూర్చుని అద్భుతమైన కోడింగ్ రాస్తాడని మీరు పొరపాటున కూడా అనుకోకండి... కేవలం ల్యాప్‌టాప్ ముందు కూర్చుని అసలు లోడ్ అవ్వని వెబ్‌సైట్లను చూస్తూ టైమ్ పాస్ చేయడమే అతని నిత్యకృత్యం.**

ఒకరోజు మధ్యాహ్నం రాజు తన చిరిగిన మంచం మీద హాయిగా పడుకుని ఆగి ఆగి తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ ఎన్ని తిరుగుళ్లు తిరుగుతుందో లెక్కపెడుతుండగా అతని ఫోన్ టింగుమని మోగింది.


వాట్సప్‌లో ఒక వింత సందేశం వచ్చింది.

'స్టాక్‌మార్కెట్ బాహుబలి - అందరికీ లాభాల వర్షం' అనే వింత గ్రూపులో అతడిని ఎవరో తెలియని అపరిచిత వ్యక్తులు అడగకుండానే చేర్చారు. ఆ గ్రూపులో పెడుతున్న మెసేజ్‌లు చూస్తుంటే రాజుకు ప్రపంచం మొత్తం నోట్ల కట్టల్లాగే కనిపించాయి.

ఆ గ్రూపులో ఉన్న ప్రొఫైల్ పిక్చర్ చూస్తే ఒక చైనీస్ అమ్మాయి ఫోటో ఉంది. కానీ పేరు మాత్రం లక్ష్మి ప్రసన్న అని అచ్చ తెలుగులో రాసి ఉంది. రాజుకు దీనిపై ఎలాంటి అనుమానం రాలేదు సరికదా చైనా వాళ్ళు కూడా మన తెలుగు పేర్లు పెట్టుకుంటున్నారా గ్లోబలైజేషన్ అంటే ఇదేనేమో అని మనసులో మురిసిపోయాడు. బహుశా ఆ అమ్మాయి పూర్వీకులు అమలాపురం వారేమో అన్నంతగా అతను ఊహల్లో తేలిపోయాడు.

ఆ గ్రూపులో వస్తున్న మెసేజ్‌లు చూస్తుంటే రాజు కళ్లు బైర్లు కమ్మాయి.

ఒకడు నేను వెయ్యి రూపాయలు పెట్టుబడి పెడితే పది లక్షలు వచ్చాయి అని ఒక నకిలీ స్క్రీన్‌షాట్ పెట్టాడు. ఇంకొకడు మా ఆవిడ ఒంటి మీద ఉన్న నగలు తాకట్టు పెట్టి ఇన్వెస్ట్ చేశాను ఇప్పుడు ఊర్లో అరవై ఎకరాల భూమి కొన్నాను అని ఒక సెల్ఫీ కూడా పెట్టాడు...




అవి చూసి రాజు గాలిలో మేడలు కట్టడం మొదలుపెట్టాడు.

వెంటనే ఆ చైనా లక్ష్మికి మెసేజ్ చేశాడు.

మేడం నాకు కూడా కోటీశ్వరుడు అవ్వాలని ఉంది నేను ఏం చేయాలి అని ఎంతో వినయంగా అడిగాడు.

అవతల నుంచి వెంటనే రిప్లై వచ్చింది.

ముందుగా మా 'కుబేర మాయ' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేయండి అని ఆమె ఎంతో మర్యాదగా చెప్పింది. అందులో కేవలం ఐదు వేలు ఇన్వెస్ట్ చేస్తే చాలు రేపు పొద్దున కల్లా పది వేలు మీ అకౌంట్‌లో ఉంటాయి. అని ఊరించే ఆశ చూపింది.

రాజు తన జేబులో ఉన్న ఆఖరి ఐదు వేలను ఎంతో నమ్మకంతో గుడ్డిగా పంపేశాడు. మర్నాడు నిద్రలేచి చూసేసరికి నిజంగానే పది వేలు అతని అకౌంట్లోకి వచ్చాయి. అది చూసి రాజుకు మైండ్‌బ్లాక్ అయ్యి పిచ్చెక్కిపోయింది. ఇన్నాళ్లూ కంపెనీలో కోడింగ్ చేస్తూ నా విలువైన టైమ్ వేస్ట్ చేశానే ఈ ట్రిక్కు ఏదో ముందే తెలిస్తే అమలాపురం మొత్తం నాదే అయ్యేది కదా అని గట్టిగా అనుకున్నాడు.

ఇక ఆ ఆశతో తన బాబాయ్ దగ్గర పిన్ని దగ్గర చివరకు పొరుగింటి పుల్లమ్మ దగ్గర కూడా రకరకాల అబద్ధాలు చెప్పి తనకున్న భూమిని కూడా తనఖా పెట్టేసి మొత్తం రెండు కోట్లు పోగు చేశాడు. తన కలల సౌధాన్ని నిర్మించుకోవడానికి సిద్ధమయ్యాడు

ఆ ముఠా వారు రాజుకు ఒక విఐపి ఐపీఓ ఇప్పిస్తామని నమ్మబలికారు. రాజుగారు ఈ కంపెనీ షేర్లు కొంటే మీరు ఎలాన్ మస్క్ పక్కన కూర్చుని కాఫీ తాగొచ్చు అని ఎంతో గొప్పగా చెప్పారు. ఆ మాటలు నిజమేనని నమ్మి రాజు తన దగ్గర ఉన్న రెండు కోట్లు ఆ యాప్‌లో పెట్టేశాడు.

యాప్ ఓపెన్ చేస్తే అందులో అంకెలు గిరగిర తిరుగుతూ ప్రాఫిట్ సెక్షన్‌లో ఏకంగా పది కోట్లు అని చూపిస్తోంది.

ఆ అంకెలు చూసి రాజు ఆనందంతో తన చిన్న గదిలోనే చిందులు వేస్తూ డాన్స్ చేయడం మొదలుపెట్టాడు. ఊర్లో అప్పు ఇచ్చిన వారందరికీ వరుసగా ఫోన్లు చేసి రేపు పొద్దున మీ

అప్పులు మొత్తం తీర్చేస్తాను అని దానికి తోడు ఎక్స్ట్రా వడ్డీ కూడా ఇస్తానని భారీ బిల్డప్ ఇచ్చాడు. తన కళ్ల ముందు లగ్జరీకారు పెద్ద బంగళా కనిపిస్తున్నట్లు ఊహల్లో విహరించాడు.

మర్నాడు పొద్దున్నే ఎంతో ఉత్సాహంగా నిద్రలేచి ఆ డబ్బులు విత్ డ్రా చేద్దామని యాప్ ఓపెన్ చేస్తే కనెక్టివిటీ ఎర్రర్ సర్వర్ నాట్ ఫౌండ్ అని స్క్రీన్ పై వచ్చింది.


గుండెల్లో రాయి పడ్డట్లు అనిపించి... వెంటనే వాట్సప్ గ్రూపులో చూస్తే యు ఆర్ నో లాంగర్ పార్టిసిపెంట్ అని కనిపించింది.

కంగారుగా ఆ చైనా లక్ష్మికి ఫోన్ చేస్తే ది నంబర్ యు ఆర్ డయ లింగ్ డస్ నాట్ ఎగ్జిస్ట్ అని చైనీస్ భాషలో వింత పాట పాడుతోంది. రాజు గుండె ఒక్కసారిగా ఆగినంత పనైంది. ఒళ్లంతా చెమటలు పట్టే శాయి. అతనికి అప్పుడే చేదు నిజం అర్థమైంది.

తను పెట్టిన భారీ పెట్టుబడి అసలు స్టాక్ మార్కెట్‌లోకి వెళ్ళలేదని అని నెత్తీ నోరూ కొట్టుకుంటున్నాడు.

ఇదంతా చూసిన రాజుకు ఒక్కసారిగా కళ్లు తిరిగి స్టేషన్‌లోనే వెల్ల కిలా పడిపోయాడు. మన అప్పుల్రాజు ఇప్పుడు కోటీశ్వరుడు కాలేదు సరికదా ఊర్లో అప్పులు ఇచ్చిన వారికి మొహం చూపించలేక, వాళ్ళ నుంచి తప్పించుకోవడానికి రాత్రికి రాత్రే పెళ్ళాం పిల్లలను తీసుకుని ఊరు విడిచి పారిపోయాడు. అపరిచిత వ్యక్తులు వాట్సప్‌లో కోట్లు వస్తాయని లింకులు పంపితే అది అదృష్టం కాదు, కొంప ముంచడానికి వచ్చిన ఆన్‌లైన్ గ్యాంగ్ అని అందరూ గుర్తించాలి.

అత్యాశకు పోతే అసలుకే ఎసరు వస్తుందని రాజు ఉదంతం అందరికీ ఒక పెద్ద కనువిప్పు కావాలి. స్మార్ట్‌ఫోన్‌లో ఎవరినైనా వారి అనుమతి లేకుండా తెలియని ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపుల్లో యాడ్ చేస్తే వెంటనే ఆ గ్రూపు నుండి బయటకు వచ్చేయడం ఉత్తమం. ఒకవేళ ఎవరైనా ఇలాంటి సైబర్ మోసానికి గురైనట్లు అనిపిస్తే ఏమాత్రం



అది నేరుగా కంబోడియాలో ఉన్న కిలాడీ మోసగాళ్ల జేబుల్లోకి వెళ్లిందని గ్రహించి పిచ్చివాడిలా తల పట్టుకున్నాడు. తన జీవితాంతం కష్టపడి సంపాదించిన సొమ్ముతో పాటు అప్పు తెచ్చిన డబ్బు కూడా ఆవిరై పోయిందని తెలిసి బోరున విలపించాడు.

రాజు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసుల దగ్గరకు ఉరుకులు పరుగుల మీద వెళ్ళాడు. అక్కడ పరిస్థితి చూస్తే రాజు లాంటి బాధితులు వందల సంఖ్యలో క్యూలో నిలబడి ఉన్నారు.

ఒకాయన ఏడుస్తూ– "సార్, నాకు అరటిపండు తొక్కల నుంచి బంగారం తీసే కంపెనీలో షేర్లు ఇస్తామని చెప్పి ఐదు కోట్లు కొట్టేశారు." అని పోలీసులకు మొరపెట్టుకుంటున్నాడు. ఇంకొకరు "అయ్యా! గాలి నుంచి కరెంటు తీసే స్టార్టప్ అని నమ్మించి నాఆస్తి మొత్తం ఊడ్చేశారు."

ఆలస్యం చేయకుండా గంటల వ్యవధిలోనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడం వల్ల పోగొట్టుకున్న సొమ్ము తిరిగి పొందే అవకాశం ఉంటుంది.

ఆన్‌లైన్‌లో వచ్చే తీపి కబుర్లు, అద్భుతమైన ఆఫర్లు అన్నీ నిజం కావని అప్రమత్తంగా ఉండాలి.

నకిలీ యాప్‌ల జోలికి వెళ్లకుండా కేవలం సెబీ గుర్తింపు పొందిన అధికారిక సంస్థల ద్వారానే లావాదేవీలు జరపడం ఎంతో శ్రేయస్కరం. కష్టపడకుండా కోట్లు వస్తాయనే భ్రమలో ఉంటే ఆఖరికి మిగిలేది శూన్యం మాత్రమే.

సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి అపరిచిత లింక్ వెనుక ఒక పెద్ద మోసం దాగి ఉంటుందని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.




ప్రతి నెలా ఇతర భాషలకు చెందిన ఒక భారతీయ కార్టూనిస్టుల పరిచయం

నిర్వహణ: నాగిశెట్టి

## శ్రీ రవి రాణే

**మ**న 'హాస్యానందం' పాఠకులకు 'ఇండియన్ ఇంక్' శీర్షికన ప్రతి నెలా ఇతర రాష్ట్రాలకు చెందిన విశిష్ట వ్యంగ్యచిత్రకారులను తెలుగు పాఠకులకు పరిచయం చేసుకునే క్రమంలో... ఈ నెల మహారాష్ట్రకు చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ **శ్రీ రవి రాణె (రవీంద్ర కె.రాణె)** గారిని పరిచయం చేస్తున్నాము.

**పరిచయం... నేపథ్యం**

వీరు ముంబైలో, 1972 ఏప్రిల్‌లో జన్మించారు. ఆయన తల్లి దండ్రులు శ్రీమతి ఎల్.కె.రాణె మరియు శ్రీ కె.జి.రాణె. ముంబై యూనివర్సిటీ పరిధిలోని ప్రముఖ విద్యాసంస్థలు కె.జె.సోమయ్య కాలేజ్, సెయింట్ జేవియర్స్ కాలేజీల నుండి ఎం.ఎస్సీ (జియాలజీ) పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన భారత ప్రభుత్వ జిఎస్‌టి(GST) విభాగంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

డ్రాయింగ్‌లోగానీ, కార్టూనింగ్‌లోగానీ ఆయన ఎలాంటి సాంప్రదాయ శిక్షణ తీసుకోలేదు.

చిన్ననాటి నుండి అబ్బిన అలవాటే కాలక్రమేణా ఒక అద్భుతమైన కళగా రూపాంతరం చెందింది.

కార్టూన్లతో పాటు హైకింగ్, ట్రెక్కింగ్, ఫోటోగ్రఫీ, పెయింటింగ్స్, క్రాఫ్ట్, ఖగోళ శాస్త్రం (Astronomy), పక్షిశాస్త్రం(Ornithology) వంటి వైవిధ్యభరితమైన అభిరుచులు ఆయనకు ఉన్నాయి.

**కార్టూన్ ప్రస్థానం మరియు అవార్డులు**

2016లో మహారాష్ట్రకు చెందిన కార్టూనిస్టుల సంస్థ 'కార్టూనిస్ట్ కంబైన్' నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో తృతీయ బహుమతి సాధించడంతో రవిరాణె గారి పూర్తిస్థాయి కార్టూనింగ్ ప్రయాణం మొదలైంది. ఈ పోటీ ద్వారానే కార్టూనింగ్‌లో ఉండే సాంకేతిక సాధ్యాసాధ్యాలు, కార్టూన్‌ను జనబాహుళ్యానికి మరింత ఆకర్షణీయంగా ఎలా ప్రెజెంట్ చేయాలో ఆయన తెలుసుకున్నారు.

ఆ తర్వాత 2020లో 'స్వాతంత్ర్యవీర్ సావర్కర్ రాష్ట్రీయ స్మారక్' మరియు 'కార్టూనిస్ట్స్ కేఫ్ క్లబ్' సంయుక్తంగా నిర్వహించిన అఖిల భారత కార్టూన్ పోటీలో తృతీయ బహుమతి గెలుచుకున్నారు.

**మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనం:** 2019 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో రవిరాణె గారు గీసిన ఒక కార్టూన్ దేశవ్యాప్తంగా,











అంతర్జాతీయ వార్తా నెట్‌వర్క్‌లలో పెను సంచలనం సృష్టించింది.

దాదాపు అన్ని ప్రముఖ వార్తా ఛానళ్లు, దినపత్రికలు ఆ కార్టూన్‌ను ప్రముఖంగా ప్రదర్శించాయి. అప్పట్లో ఆయన ఊహించి గీసిన కార్టూన్, నేటి మహారాష్ట్ర రాజకీయాల్లో అక్షరాలా నిజమైంది!

**శైలి...పనితనం**

రవి రాణె గారు తన కార్టూన్లను ప్రింట్ మీడియాలో కంటే ఎక్కువగా సోషల్ మీడియాలోనే పంచుకుంటారు.

మాటలు లేని, కేవలం భావంతోనే నవ్వించే (Captionless) కార్టూన్లంటే ఈయనకు మహా ఇష్టం.

కేవలం తాత్కాలికంగా వచ్చిపోయే రాజకీయ, సామాజిక పరిణామాల కంటే, ఎప్పటికీ నిలిచిపోయే సార్వజనీన అంశాలపై కార్టూన్లు గీయడానికి మొగ్గు చూపుతారు.

ముఖ్యంగా వైజ్ఞానిక దృక్పథాన్ని (Scientific attitude) పెంపొందించే కార్టూన్లు గీయడం వీరికి అత్యంత ఇష్టమైన అంశం.

**సాంకేతికతతో ప్రయోగాలు:** వీరికి ఒకే రకమైన శైలి (Fixed style) అంటూ లేదు. బ్లాక్ స్కెచ్ పెన్‌తో పేపర్‌పై గీసి, దాన్ని మొబైల్ యాప్స్(Colour, PicsArt) ద్వారా ఎడిట్ చేయడం, పిసి(PC) లో 'MS Paint' ఉపయోగించడం, డిజిటల్ ప్యాడ్‌పై గీయడం... అవసరాన్ని బట్టి సరికొత్త ఎఫెక్ట్స్ కోసం AI (కృత్రిమమేధ) ని కూడా ఉపయోగిస్తూ నిరంతరం ప్రయోగాలు చేస్తుంటారు.

ఆయనకు ఇష్టమైన అంతర్జాతీయ, జాతీయ కార్టూనిస్టులలో సత్యేన్ తన్ను, మారియో మిరాండా, ఎస్.డి. ఫడ్నిస్, వసంత్ హాల్బే, వసంత్ సర్వతే, ఆర్.కె. లక్ష్మణ్, ఘనశ్యామ్ దేశ్‌ముఖ్, క్లాస్ పిట్టర్, సెంపే, సతీష్ ఆచార్య, చారుహాస్ పండిట్, మార్ధిల్లో వంటి మహామహులు ఉన్నారు. వారి విశిష్టమైన శైలి, పంచ్‌లీతిజిజిల ఎంపిక, ప్రదర్శన ఆయనను ఎంతగానో ప్రభావితం చేశాయి.

**నేటి తరం కార్టూనిస్టులకు రవి రాణె గారి సందేశం:**

"ప్రస్తుత కాలంలో భారతదేశంలో కేవలం ప్రింట్ మీడియాలోనే కార్టూనిస్ట్‌గా పూర్తి స్థాయి కెరీర్ సాగించడం కాస్త కష్టతరమైన విషయమే. పత్రికల్లో పాకెట్ కార్టూన్లకు పాఠకుల్లో ఆదరణ ఉన్నప్పటికీ, యాజమాన్యాలు వాటికి ఇచ్చే విలువ తగ్గింది.

కాబట్టి కార్టూనిస్టులకు ఇలస్ట్రేషన్స్ (చిత్రీకరణ) కూడా తెలిసి ఉండాలి. అయితే, సృజనాత్మకత ఉంటే సోషల్ మీడియాలో అద్భుతంగా రాణించవచ్చు, మంచి ప్రజాదరణ పొందవచ్చు.

కార్టూన్‌కు 'పంచ్' (Punch) అనేది ప్రాణం (ఆత్మ) అయితే, 'ప్రెజెంటేషన్' (Presentation) అనేది శరీరం. ఇతరులు గమనించలేని సూక్ష్మమైన పంచ్‌ను వెలికితీసేలా మీ మెదడుకు శిక్షణ ఇవ్వండి. ఆ పంచ్‌ను ఎంత సులువుగా ప్రెజెంట్ చేయాలంటే... దాన్ని ఎవరైనా, ఎప్పుడైనా చూడగానే క్షణంలో అర్థం చేసుకోగలగాలి."

మన తెలుగు పాఠకులు మరియు కార్టూనిస్టుల తరపున వీరి భవిష్యత్తు మరింత శుభకరంగా ఉండాలనీ వీరి కార్టూన్లు ప్రపంచంలోని హాస్యప్రియులందరినీ సదా అలరిస్తూ ఉండాలని కోరుకుందాం.

కార్టూనిస్ట్ శ్రీ రవి రాణె గారి ఫేస్‌బుక్ ఐడీ:
https://www.facebook.com/ravi.warik

# Reverse Gear
# వెనక్కి వెళ్ళే కథలు



గంగాధర్ వడ్లమన్నాటి-
9908445969

## వెనక్కి ఇవ్వాలి...

**కంగారుగా వనజ లోపలికి రావడం చూసిన లలిత, ఒక్క సారే మట్టిలో పాతిన జెండా కొయ్యిలా నిలబడిపోయి... మూతి మీద వేలు పెట్టుకుని లోతుగా ఆలోచిస్తూ...**

**"ఏమైంది? ఊరికి వెళ్తానని ఉత్సాహంగా ఉరుక్కుంటూ వెళ్ళి... ఇలా నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ వెనక్కి వచ్చేసా వేంటి? అన్నయ్య గన్నవరం బస్టాండ్‌కి రాలేదా?" అడిగింది.**

**"మీ అన్నయ్య బస్టాండ్‌లోనే ఉన్నారు... నేనే బస్టాండ్‌కి ఆటోలో వెళ్తూ, వెళ్తూ నా మెడ తడుముకున్నాను... దాంతో నా మతి తడబడిపోయి గడగడలాడిపోయాను. వేడి వేడి వడ తిన్న దానిలా గట్టిగా అరిచి... తర్వాత వెక్కి వెక్కి ఏడ్చి, ఇలా వెనక్కి వచ్చేసాను!" చెప్పింది బిత్తర చూపులతో తెగ కంగారు పడిపోతూ.**

"నిన్నెవరో అంగారక గ్రహంలో బందించినట్టు... ఎందుకంత కంగారు? ముందు నువ్వలా గుండాపిండయిపోయి ఉండ చుట్టుకు పోకుండా, కాస్త నిదానంగా ఉండు!" అని ఓ రెండు క్షణాల తర్వాత

"ఆఁ!... ఇప్పుడు చెప్పు ఏమైంది?" అడిగింది.


"ఏం లేదు వదిన... బయటికి వెళ్ళి కొంచెం దూరం నడిచి, వీధి పక్కన ఐస్‌క్రీం తిని ఆటో ఎక్కాను. అంతలోనే నా బంగారు గొలుసు ఎక్కడో పడిపోయింది." అని బుర్ర గోక్కుని...


"నువ్వు ఏమీ అనుకోకపోతే, నీకు నేను ఇందాక ఇచ్చిన అలాంటి బంగారు నగని నాకు తిరిగి వెనక్కి ఇచ్చేయి!" అంది.

"అదేవిటి? వెనక్కి ఇచ్చేయడవేంటి? అన్నయ్యే ఇద్దరికీ ఒకేలాంటి బంగారు నక్లీస్లు కొన్నాడని చెప్పి... నా నక్లీస్ నాకు ఇచ్చావ్. మళ్ళీ వెనక్కి ఇచ్చేయడవేంటి?" అడిగింది లలిత అయోమయంగా.

"అవును! మీ అన్నయ్య మనిద్దరికీ ఒకే రకం నక్లీస్లు ఇచ్చారు... పనుండి నన్ను ఇచ్చి నేరుగా బస్టాండ్‌కి రమ్మన్నారు. నేను సరే అని నీది నీకు ఇచ్చేశాను... నాది ఎలా ఉందో చూసుకుందామని వేసుకున్నాను. అలాగే తీయకుండా మర్చిపోయి బయటకి వెళ్ళిపోయాను, దాంతో ఎక్కడో పడిపోయినట్టుంది... ఇప్పుడు మీ అన్నయ్యకి ఈ విషయం తెలిస్తే, కషాయం తాగిన మనిషిలా మొహం పెట్టి... విష సర్పంలా బుసలు కొట్టేస్తారు. దాంతో పరిస్థితి విషమిస్తుంది... కాబట్టి నీ నగ నాకు ఇస్తే... అదే నా నగని మీ అన్నయ్యతో చెప్పేసి ఈ గండం నుండి గట్టు ఎక్కుతాను. లేదంటే మీ అన్నయ్య నన్ను... నన్ను..." అంటూ భయం భయంగా సోఫాలో కూలబడింది.

"నువ్వు సోఫాలోనే కాదు...మంచం మీద కూలబడినా నేను నా నగ ఇవ్వడం మాత్రం కుదరని పని!" అని లలిత అంటుండగానే, దశ మార్చుకున్న వాయిగుండంలా వనజ భర్త, అదే లలిత వాళ్ళ అన్నయ్య వచ్చాడు.






ఇద్దరు గప్‌చుప్‌గా ఉండడంతో...

"ఏంటి వనజా! బస్టాండ్‌కి రాలేదు. నీతో పని పెట్టుకుంటే, స్నానానికి ఊబిలో దిగినట్టే. సరే మరో గంట తర్వాత బస్సులోనన్నా వెళదాం!" అన్నాడు.

"అదీ... మరీ..." అంటూ వనజ నీళ్లు చప్పరించి... "అదేనండి! నగ ఇంట్లో ఎక్కడో పెట్టి మర్చిపోయినట్టున్నాను. కనబడట్లేదు. వదిన ఏమైనా చూసిందేమో అని అడుగుతున్నాను, అందుకే ఈ ఆలస్యం!" అనగానే...

"నీకు ముందే చెప్పాను! నీకు నగలు జాగ్రత్త చేయడం రాదని... ఏ వస్తువు ఎలా జాగ్రత్త చేయాలో మా అక్కని చూసి నేర్చుకో. ఇప్పుడు చూడు ఏం చేసావో?... కొనేదాకా ప్రాణం తీసావ్. నీకు కొనడం నాది బుద్ధి తక్కువ. నీకు నిర్లక్ష్యం తప్ప జాగ్రత్త చేసే లక్షణం లేదు..." అంటూ నానా మాటలు అని, చివర్లో ఓ చెంపదెబ్బ కొట్టి... "వస్తా ఉండు!" అని విసురుగా తలుపేసి బయటకు వెళ్ళిపోయాడు.

ఓ గంట తర్వాత, ఏడుస్తున్న వనజ దగ్గరికి వచ్చిన లలిత... "ఇదిగో నా నక్లీస్ వెనక్కి ఇచ్చేయమన్నావ్ కదా! వెనక్కి ఇచ్చేస్తున్నాను తీసుకో. ఇదే నీ నక్లెస్ అని అన్నయ్యతో చెప్పు, బాధపడకు. దీనికి సరిపడా డబ్బులు మాత్రం నాకు ఇచ్చేయాలి. నేను వేరేది కొనుక్కుంటాను." చెప్పింది లలిత.

"ఇదేదో ఇందాకే నేను అడిగినప్పుడే వెనక్కి ఇచ్చేస్తే బావుండు కదా వదిన... తిట్లు, ఒక చెంప దెబ్బ తప్పేది!" అంది.

"అలా అనకు! అప్పుడే నేను ఇచ్చేస్తే, అది మా ఆయన పర్మిషన్ లేకుండా ఇచ్చినట్టు అవుతుంది... పైగా మా అత్తగారు అడిగితే ఏం చెప్తాను. నేను అప్పుడే ఇచ్చేసి ఉంటే, ఒకవేళ నువ్వు అది తీసుకుని, ఇది నా నగే వదిన అని అనక అంటే నేను ఏమైపోవాలి? అప్పటికే నేను మా ఆయనకి... మా అత్తగారికి ఆ నగ గురించి చెప్పేశాను. పైగా మా ఆయనకి ఫోటో తీసి కూడా పంపించాను. అందుకనే, ఇప్పుడు ఆయన ఆఫీస్ నుంచి వచ్చాక... కప్పుడు కాఫీ ఇచ్చి విషయం చెప్పాను. సరే అలాగే ఇవ్వు అన్నారు. అలాగే మా అత్తకి కూడా చెప్పాను. కనుక ఇప్పుడు ఈ నగను నేను విచ్చలవిడిగా



నీకు ఇవ్వొచ్చు... నువ్వు తీసేసుకోవచ్చు!" అంది ఆ నగ ఆమెకి అందిస్తూ.

ఆ మాటలకి, లలిత వంక గుర్రుగా చూసిన వనజ... "నామీద నమ్మకం లేదా వదినా?" అంది.

"మొన్న దసరాకి వచ్చినప్పుడు, నా పట్టుచీర చూసి సరదా పడి... ఒకసారి పట్టుకెళ్ళి, ఓ పెళ్ళికి కట్టుకెళ్ళి, మళ్ళీ ఇచ్చేస్తానని చెప్పి వెనక్కి ఇవ్వలేదు. నేను ఫోన్ చేసి అడిగితే... అది ఎక్కడ పెట్టానో గుర్తులేదు వదినా... చూస్తాలే అని ఇక ఇవ్వలేదు. పట్టు చీర కోసం అంత పట్టు పట్టడం ఎందుకూ అని అప్పుడు విడిచిపెట్టేశాను. అందుకే ఇప్పుడు ఈ జాగ్రత్త!" చెప్పింది.

వెనక్కి ఇచ్చినందుకు సంతోష పడాలో... తనని ఇంత టెన్షన్ పెట్టినందుకు... బాధ పడాలో తెలియక, కళ్ళు తుడుచుకుంటూ, తీసుకోవడమే కాదు, వెనక్కి ఇవ్వడంలో కూడా అంటే కరెక్ట్‌గా ఉండాలి అని నిర్ణయించుకుని, బయల్దేరి వెళ్ళబోతూ ఆగిన వనజ...

'అమ్మో పట్టుచీర వెనక్కి ఇవ్వడం ఆలస్యమైతేనే చెంప దెబ్బ తిన్నాను. ఇప్పుడు ఈ నెక్లెస్ డబ్బులు తిరిగి ఇవ్వడం ఆలస్యమైతే చెప్పు దెబ్బ తింటానేమో! అని చెక్కు రాసి లలితకి ఇచ్చి,

"వస్తా వదినా!" అంటూ వెళ్ళిపోయింది.

ఆ చెక్కు అందుకున్న లలిత చక్కని నవ్వుతో, పోనీలే ఇలా అయినా వనజలో మార్పొచ్చింది అని సంతోషించింది.



# సోలో బతుకే...

పంతంగి శ్రీనివాస రావు
9182203351

**"దయానందం! గ్రూప్‌లో ఈ పోస్ట్ ఎందుకు పెట్టావు?" డైరెక్ట్‌గా లోపలకి వచ్చి చిందులేశాడు జనార్దనం ఫోన్ చూపించి.**

**"గ్రూప్‌లో పెట్టాను... సంతోషించు. అసలు లాయరు నోటీసు ఇవ్వలేదు... ఇస్తానేమో!" నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు దయానందం.**

**"మా ఇంటి గొడవ గురించి కమ్యూనిటీలో ఉన్న రెండొందల కుటుంబాలకు ఎందుకు తెలిపావు? అందరి సంసారాలు చక్కగా ఏడుస్తున్నాయా? పరువు నష్టం దావా వేస్తాను. ఏమనుకున్నావేమో?" మరలా చిందులు తొక్కాడు జనార్దనం.**

"వేయి.. వేయి.. అప్పుడు ఈ ఊరికేమిటి? సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికే తెలుస్తుంది..." లుంగీ మడిచి చెప్పాడు దయానందం. కాలరు మడుద్దామంటే అప్పుడతను బనియను మీద ఉన్నాడు మరి.

కొద్దిగా తగ్గి చెప్పాడు జనార్దనం...

"చూడు దయానందం..." ఆగి... డోర్ దగ్గరగా వేసి... "మా ఇంటిలో గొడవ గురించి..." చెప్పబోతుండగా...


"మీ ఇంట్లో మీరు మీరు ఎలా తన్నుకుంటే మాకెందుకు కానీ అందువల్ల మా కలలు భగ్నమయ్యాయి." అడ్డొచ్చి చెప్పాడు దయానందం.

అర్థం కాలేదు ఆ మానవుడికి..

"మొగుడు పెళ్ళాలం మేము అరుచుకున్నామే అనుకో... అందుకు మీకు వచ్చిన నష్టం ఏమిటి?" బట్టతల మీద రెండు వేళ్ళతో దరువు వేసుకుంటూ అడిగాడు జనార్దనం.

"మీ ఇంట్లో గొడవ మా ఇంట్లో స్టీరియో ఫోనిక్ సౌండ్‌లా వినిపిస్తోంది... ఒకరోజు కిటికీలు కూడా వేయటం మరచిపోయారేమో... మీ ఆవిడ నీ బట్టతల మీద చేతితో చరవటం మా అబ్బాయి చూసాడు...." ఆగాడు దయానందం.

"అయితే..." సందేహంగా జనార్దనం.




" ఛా! భార్యలు ఇంతగా రెచ్చిపోతారా?... పాపం!అంకుల్ ను ఆంటీ ఇంతగా తిట్టడం... బాప్రే... బయటకు ఎంతో సౌమ్యురాలుగా కనిపించే ఆంటీ ఇలా ఉందంటే నమ్మలేక పోతున్నాను. నేను జీవితంలో పెళ్ళే చేసుకోను. అని భీష్మించుకు కూర్చున్నాడు. అందుకే నాకు కసి పుట్టింది..." పళ్ళు పటపటా కొరికాడు దయానందం.

"సరే కానీ దయా... డిలీట్ చేయి! ఇంకా ఎవరూ చూసి ఉండక పోవచ్చు..." కాళ్ళ బేరానికి వచ్చాడు జనార్దనం.

అయితే జరగవలసిన డామేజీ అప్పటికే జరిగిపోయింది.

గ్రూప్ ఓపెన్ చేసి డిస్కషన్ చేస్తున్న జనార్దనం ఫోన్ లోకి వాట్సప్ మ్యూజిక్ టింగ్ టింగ్ అని సౌండ్ చేయసాగింది.

చూస్తే గ్రూప్‌లో పలురకాల వ్యాఖ్యానాలు పలువురు పుంకాను పుంకాలుగా చేయసాగారు.

"కొంప మునిగింది దయానందం. కమ్యూనిటీ మొత్తం తెలిసి పోయింది... నా పరువు పోయింది." తల పట్టుకున్నాడు.

"పోయింది నీ పరువే! ఇక్కడ మా వాడి జీవితమే పోయింది." రిటార్ట్ ఇచ్చాడు దయానందం.

✦✦✦

అదే రోజు సాయంత్రం కమ్యూనిటీలో అత్యవసర సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేయబడింది.

కమ్యూనిటీ ప్రెసిడెంట్ అడిగాడు దయానందను.

"చూడు దయానందం! మీ ఇంటి ఎదురుగా ఉన్న ఫ్లాట్ ఓనరు జనార్దనం గురించి మీరు గ్రూప్‌లో పెట్టడం అంత బాగోలేదు. మన కమ్యూనిటీలో ఎవరైనా ఉత్సాహ పరులు ఇదే సంఘటనను ఏ ఫేస్ బుక్‌లోనో, ఇన్‌స్టాలోనో..." చెప్పుకు పోతున్న ప్రెసిడెంట్ మీద గయ్యిన లేచాడు జనార్దనం.

"ఊర్కోవయ్యా! నువ్వేదో సలహాలు ఇచ్చి లేని ఆలోచనలు ఇస్తున్నట్టుంది... జరగవలసింది చూడండి!" అన్నాడు జనార్దనం.

"ఆ విషయానికి వస్తే...దయానందం

వారింట్లో గొడవను నువ్వెందుకు గ్రూప్‌లో పెట్టావు? అది రేపు వైరల్ అయితే...రాష్ట్ర వ్యాప్తంగా...కాదు...దేశ వ్యాప్తంగా..." అంటోన్న ప్రెసిడెంట్ మీద గయ్యిన లేచాడు జనార్ధనం మళ్ళీ.

"సొల్లు ఆపి అసలు విషయానికి రండి! మా ఆలుమగల జగడం..."

"ఆఁ! అటే వస్తున్నా! దీనికి నీ సంజాయిషీ కావాలి దయానందం." అన్నాడు ప్రెసిడెంట్.

"ఆ తన్నులాట చూసి మా అబ్బాయికి పెళ్ళి మీదనే విరక్తి పుట్టింది. చెప్పుకోవటానికి లక్షన్నర జీతం నెలకు.ముప్పయి సంవత్సరాలు దాటుతున్నాయి. అసలే సంబంధాలు రాకపోయినా, కాలికి బలపం కట్టుకుని అమ్మాయిల కోసం వేట మొదలు పెట్టాను. ఇప్పుడు... 'నాకు రష్మికా మందన్నా దొరికినా వద్దు.. అసలు ఈ జీవితానికి ఇక పెళ్ళే వద్దు!' అంటున్నాడు. అందుకే నాకు తిక్కరేగి..." ఆయాసం ఆపుకుంటున్నాడు దయానందం.

"ఇదుగో! జనార్ధనం... భార్యా భర్తల మధ్య గొడవలు సహజం. అయితే అవి బయటకు రాకూడదు. గోడలకు చెవులు ఉంటాయి. లోపల గోడలు మీ గొడవలను కాపాడవచ్చు...ఏదో మాస్టర్ బెడ్ రూమ్‌లో తగాదా పడకపోయారా?" సంజాయిషీ అడిగాడు ప్రెసిడెంట్.

"టీవీ హాల్లో ఉంటుంది కానీ... బెడ్ రూమ్‌లో ఉంటుందా?!" పరధ్యానంగా చెప్పాడు జనార్ధనం.

అక్కడ ఉన్న ఫ్లాట్ ఓనర్లందరూ నోరెళ్ళబెట్టారు..

"టి వి నా?!...." అంటూ!

ఇక చెప్పక తప్పలేదు జనార్ధనంకు.

" అవును! టీవీ విషయంలోనే... మొగుడే నా దైవం సీరియల్ చూస్తున్న సమయంలోనే మేము చేసిన పొరపాటు గాలి కోసం కిటికీలు తెరవటం! కరెంట్ పొదుపు కోసం ఫ్యాన్లు ఆపటం..."


"ఆ తర్వాత..."అందరిలోనూ క్యూరియాసిటి.


తిరిగి చెప్పాడు జనార్ధనం–

"నేను డైనింగ్ వద్ద కూర్చుని ఫోన్‌లో టిక్ టిక్ అనిపిస్తున్న సమయంలో...



నా పెళ్ళాం ఆ దిక్కుమాలిన నాలుగొందల ఎపిసోడ్ మొగుడే నా దైవం చూస్తున్న సమయంలో స్టవ్ మీద ఏదో మాడు వాసన వస్తే... చూస్తే... అన్నం మాడిపోయింది. అక్కడ వచ్చింది మాకు గొడవ!" కొద్దిగా శ్వాస తీసుకుని... " ఆ మొగుడే నా దైవం సీరియల్ చూస్తూనే నా మీద యుద్ధానికి వచ్చింది నా భాగ్యం! అలా గొడవ ముదిరి ముదిరి ఆవేశం పట్టలేక నా బట్టతల మీద అలా అలా నాజూగ్గా ఒక్కటి వేసింది చేతితో... అదుగో! ఆ సీన్ చూశాడట ఈ దయానందం కొడుకు. ఆ వేసింది నా భార్య. వేయించుకుంది ఆ భార్యకు మొగుడినైన నేను. దానిని వాట్సాప్ గ్రూప్‌లో పెట్టి... ఇలా మా కుటుంబ పరువు తీశాడు దయానందం." శ్వాస వదిలాడు జనార్ధనం.




"ఏమయినా ఉంటే నాలుగ్గోడల మధ్యనే జరగాలి. పిల్లలు ఉంటారు... చూస్తారు అనే సోయి ఉండక్కర్లేదాట ఇప్పుడు మా పిల్లోడు దదుసుకున్నాడు. ఇక సంబందాలు చూడ కండి. చూసినా నేను పెళ్ళే చేసుకోను. సోలో బతుకే సో బెటరూ అని రాగాలు తీస్తున్నాడు. మా ఇంటికి ఇక కోడలు రాదా? మనవడినో, మనవరాలినో ఎత్తుకోమా ఇక?... మా కలలు కల్లలేనా?" వాదించసాగాడు దయానందం.


"ఏదేమైనా ఇంటికి వెళ్లి చెప్పాల్సింది దయానందం! ఇది ప్రతి ఇంటిలోనూ జరిగే తంతే... కాకపోతే జనార్దనం గొడవ బయట పడింది. అంతే! మీ మీ గుండెల మీద చెయ్యేసుకుని చెప్పండి...మీ మీ మొగుడూ పెళ్ళాలూ గొడవలు పెట్టుకోరా?... అదుగో ఆ సదానందం దంపతులు తన్నుకోరా? ఆ చిదానందం తన భార్యతో గిల్లికజ్జాలు పెట్టుకోడా?..." ఇలా చెప్పుకు పోతున్న కమ్యూనిటీ ప్రెసిడెంట్ మీద ఇంతెత్తున లేచాడు సదానందం అనే వ్యక్తి.

"ప్రెసిడెంటూ!... ఇదేందయ్యా అందరి నామాలు జపిస్తున్నావు! సమస్య ఏమిటి? అది ఎవరిది? అంతవరకే ఉండాలి కానీ..." అంటోన్న అతని మాటలను అందరూ బల పరుస్తూ... " అదీ అలా చెప్పు! అందరి ఇళ్ల భాగోతాల గురించి చర్చడానికా ఈ సమావేశం ఏర్పాటు చేసింది? పుండు ఎక్కడుందో అక్కడే మందు వేయాలి కానీ..." తమ పేర్లు ఎక్కడ వస్తాయో అని అందరూ కోరస్‌గా పలికారు.

"అయితే ఇప్పుడేం చేద్దాం! ఆ మెసేజ్ గ్రూప్‌లో అందరికీ చేరింది. ఆటోమేటిక్‌గా వారంలో డిలీట్ అవుతుంది. ఏదో ఆవేశంలో పెట్టాడు. ఇక వదలి వేయండి..." ఫైనల్ నిర్ణయాన్ని ప్రకటించాడు ప్రెసిడెంట్.

"దయానందం క్షమార్పణ చెప్పాల్సిందే... ఇంత జరిగాక ఇక ఉపేక్షించేది లేదు." తప్పని సరి పరిస్థితుల్లో రీఛార్జ్ అయ్యాడు జనార్దనం.

"ఎందుకు చెప్పాలి? నేను చేసిన తప్పేమిటి? నాకు స్వాతంత్ర్యం ఉంది. జరిగిందే చెప్పాను. ముందుగా మా అబ్బాయికి ధైర్యం చెప్పి వాడిని పెళ్ళికి ఒప్పించండి... అందరి భార్యలూ ఇలాగే ఉంటారు. రేపు తన భార్య కూడా ఇలాగే ఉంటుంది అనే వాడి భావనను రూపు మాపండి." ఎగశ్వాస పీలుస్తూ చెప్పాడు దయానందం.




"నిజమే కదా! పాత సినిమాలకూ, కొత్త సినిమాలకూ తేడా లేదా?... అలాగే అప్పటి పెళ్లాలకూ... ఇప్పటి పెళ్లాలకూ కూడా తేడా ఉంటుంది. ధైర్యంతో కాపురం చేయాలి... అన్నింటికీ సిద్ధ పడాలి. పెళ్ళిళ్ళు చేసుకోకపోతే సృష్టికి ద్రోహం చేసినట్లు కాదా? ఎవరినైనా పర్సనాలిటీ డెవలప్ మెంట్ పరిజ్ఞానం కలిగిన వక్తను పిలిపించి ఆ అబ్బాయికి కౌన్సిలింగ్ ఇప్పిద్దాం... కొన్ని రోజుల్లో ఆ అబ్బాయి నిర్ణయం మారుతుందనే ఆశతో ఎదురుచూద్దాం.. ఇక సెలవు తీసుకుందాం!..."

అంతకు మించి చేసేదేమీలేక తేల్చేశాడు ప్రెసిడెంట్ రమేష్.







రాత, గీత
BOMMAV

మన చుట్టు పక్కల సాదా సీదా జనాలతో
పాటూ... మందు బాబులు,
విందు బాబులతో పాటు... బడా బాబులు,
బడాయి బాబులూ ఉంటారు...
వీళ్లలో ఈ **బడాయి బాబుల బడాయే**
మన కథకి మూలం!






ఈ నెల రచయితలు:

✦ ఉపద్రష్ట సుబ్బలక్ష్మి ✦ మచ్చ విజేందర్

**ఫ్లాష్‌బ్యాక్**

శేషాచలం పదవీ విరమణ చేశాక, వచ్చిన డబ్బులలో మిగిలిన ఓ లక్ష రూపాయతో తన చుట్టూ ఉన్న వాళ్ళని వాడుకుని ఒక చిన్న ఓటీటీ సినిమా తియ్యాలన్న ఉద్దేశంతో పరిచయస్థులను వాడుకునే క్రమంలో నానా పాట్లు పడుతుంటాడు.

(గత సంచిక తరువాయి)

## ఇరవై మూడవ సీన్– ఉపద్రష్ట సుబ్బలక్ష్మి

'ఏమిటో ఈ గోలలో సినిమా ఓపెనింగ్ నా బుర్రలో కూడా ఓపెనవడంలేదు.' అనుకుంటూ శేషాచలం–

"ఇక ఎవరి బాక్స్‌లు వాళ్ళు విప్పుకుని భోంచెయ్యండి ముందు." అన్నాడు.

అందరికీ నీళ్ళు అందించింది డైనోసార్.

"నేను వంటలు కూడా ఏవో కొంచెం తెచ్చాలే... నువ్విలా ప్రతిదానికీ అలిగితే మళ్ళీ గణేష్, ఆ పాట గానీ విన్నాడంటే ఆగమాగం చేసి సురేష్ గాడికే ఆపాట పెట్టమంటూ ఛాన్స్ వాడు తన్నుకు పోయినా ఆశ్చర్యం లేదు. నీ ఇష్టం... ఇక ఫో!" అంటూ అంతకు ముందు తాను కూర్చున్న సోఫా దగ్గరకు వెళ్ళి పోయింది రాజ్యం పిన్ని.

ఆలోచనలో పడిపోయాడు రమేష్.

"ఇదిగో... బోలెడు సొరముక్కలేసి పులుసూ రామములక్కాయ పప్పూ చేసాను. అందరూ తలాకొంచెం తినండి" అంటూ తనతో తెచ్చిన పెద్ద కేరియర్ విప్పింది రాజ్యం పిన్ని.

"సొర సూపు మస్తుంటది... తలలు మస్త్ ఏసిందంట!" అంటూ అందరూ...

"నాకూ... నాకూ... నాకూ..." అంటూ ఎగబడ్డారు.

"ఆగండాగండి! ఆగండ్రా... అందరికీ తెచ్చాను. వరసగారండి. అమ్మాయ్ కాంతం! ముందు అబ్బాయీ నువ్వూ తీసుకోండి!" అంటూ తాను క్యారేజ్ తోబాటు తెచ్చిన రెండు పళ్ళేలలో అందించింది కాంతానికి.

"గింట్లో తొక్కులేసుకునేగాతినేది?... గీడ విందు బోనాలు నడుస్తుంటే నేను నిజ్జంగా పాగల్ గానినే" అనుకుంటూ బయటకు నడవ బోయిన రమేష్ గభాలున లోపలికి వచ్చేడు.

అందరూ సూప్ పోయించుకుని చొంగలు కారిపోతూ ముద్దలు నోట్లో కూరుకుని రుచి అందక–"గిందులో సొర తలముక్కలేవీ లెవ్వే!" అన్నారు అందరూ ఒకేసారి.

"ఔ!" అన్నాడు రమేష్.

"అదేమిటి? ఒక కాయంతా వేసేనే?"అంది రాజ్యం విస్తుపోతూ.

"సొరల్! సొరల్.. ఫిష్ కాదా?" అన్నాడు రమేష్.

అప్పుడు అసలు సంగతి అర్థమైంది శేషాచలానికి.

"అది కాదర్రా! మా వేపు ఆనపకాయని సొరకాయ అంటారు. తలా అంటే ఎవ్వరీ... అంటే... ప్రతీ అని అర్థం. హెడ్డు అని కాదు. రామములక్కాయ అంటే టమోటా ములక్కాడ కాదు. అది టమోటా పప్పు. రుచిగానే ఉంది తినండి!" అంటూంటే అందరూ మిర్రిమిర్రి చూసారు.

రాజ్యం పిన్ని ముఖం వాడిపోయింది.

ఆమెని ఉత్సాహ పరచడానికి...

"పిన్నీ! ఏదో పాటన్నావు? సొరపులుసు లాంటిదేనా?"అన్నాడు నెమ్మదిగా శేషాచలం.

"అదేమీలేదురా...ఇవాళ వేలంటైన్స్‌డే కదా! చెల్లి మనసులో కోరిక చూచాయగా తెలిసిన అన్న చెల్లిని చూస్తూ పాడతాడు! చూడు...."

అంటూ కాగితం శేషాచలం చేతిలో పెట్టి...

"బావుంటే వాడు!" అంది ఆమె.

దానిని చూస్తూ పొంగి పోయాడు శేషాచలం.

బెలూన్‌లా పొంగిపోతున్న శేషుని చూస్తూ "కలనిజమాయెగా... కోరిక తీరెగా..." అనుకుంది రాజ్యం సంతోషంగా.

అందరినీ కూర్చోపెట్టి...

"ఓపెనింగ్ సీను మనం ఇప్పటి దాకా ఏమీ అనుకోలేదు కదా... అన్న సెంటిమెంట్‌తో ఇలా మొదలౌతుంది.


"ఆవేళ వేలంటైన్స్ డే! ప్రతిభ ఉత్సాహంగా జింక పిల్లలా గెంతుతూ మహేష్ గురించి కలలు కంటూ ఉంటుంది. చెల్లి మనసులో కోరిక చూచాయగా తెలిసిన అన్న చెల్లిని చూస్తూ ఇలా పాడతాడు.


ప్రేమికులకి కళ్ళే ప్రేమవాకిళ్ళమ్మా
ఒళ్ళు పులకరింతలతో తుళ్ళి తుళ్ళి
తుళ్ళు నమ్మా
చరవాణిలో వార్తల సుళ్ళేసుళ్ళూ
వాటికి ఉత్తరాల రూపమిస్తే తీసుకెళ్ళ
డానికి చాలవు పదిబళ్ళూ...
తిరగడానికి పార్కేకాదు...
పనికివస్తాయి గుళ్ళూ
తల్లిదండ్రులకి తెలిస్తే పేలుస్తారు
తుపాకీ గుళ్ళూ
కడతారు చక్కగా అబద్ధాల దళ్ళూ
తిరుపతి వెళ్ళకుండానే
చేయించు కుంటారు గుళ్ళూ
దారంతా నిండి ఉన్నాయి ముళ్ళూ
తమని విడదీయడానికి చేస్తున్నార,ని
అనుకుంటారు, కుతంత్రాలూ కుళ్ళూ!!
ప్రేమికులకి...
లెక్కచేయకుండా
చేసేసుకుంటారు పెళ్ళిళ్ళూ
అప్పటినుంచి మొదలౌతాయి
వాగ్వివాదాల సుళ్ళూ
గోళ్ళతో పోయేదానికి
ఉపయోగిస్తారు గొడ్డళ్ళూ
కళ్ళు ఔతాయి ముళ్ళపంది ముళ్ళూ
కోపంతో రగిలిపోతుంది ఒళ్ళూ
అణిగిపోతాయి ప్రేమికుల దినోత్సవ
పరవళ్ళూ
అవగాహన పెంచుకుని
చేసుకోవాలి పెళ్ళిళ్ళూ
జీవితమంటే వసంతమేకాదు
హేమంత శిశిరాల ముగ్గిన పళ్ళేపళ్ళూ!!
ప్రేమికులకి....

## ఇరవై నాల్గవ సీన్–
## మచ్చ విజేందర్

సాయంత్రం కావస్తుండటంతో పాటను కట్టిపెట్టి ఎవరిండ్లకు వాళ్ళు వెళ్ళిపోయారందరు.

ఆ పాటతో ప్రతిభను చెల్లిగా జీర్ణించుకోలేక చిర్రెత్తుకొచ్చిన రమేష్, ఎలాగైనా ప్రతిభను






మహేషుకు దక్కకుండా చేయాలని భావించాడు. మాయల ఫకీరు అరచేతిలో అంజనం వేసుకొని చూస్తే బాలనాగమ్మ కనిపించినట్టు తన అతితెలివినంతా ఉపయోగించి చూస్తే... రమేష్ ఆలోచనలకు సురేష్ తట్టాడు. ఎలాగైనా తను ఆడబోయే చదరంగంలో అతన్ని పావుగా వాడుకోవాలనుకుని సురేషును కలిసాడు.

"సూడు సురేసూ! నిన్న ఆ మగేసు ప్రతిభల యికయికలూ పకపకలూ గమనించినావేటీ. ఆ మగేసుగాడు ఏటికీ పనికిరాని పోరంబోకు ఎధవ... మీ నాయినకీ రాజకీయపరంగా పజల్లో మంచి పేరుండాది. నీ ఒడ్డూ పొడుగూ అందం సందం ఆత్తీ అంతత్తుల్లో ఆడెందుకూ గొరగాడు... అసూంటిది ఆ ప్రతిభ నిన్ను గాదని ఆ మగేసుగాడెంట తిరగడమేటీ?... నిన్ను అగుమానించడానికే ఆళ్ళు అలా సేత్తున్నారేమోననిసి నా అనుమానం. అయినా నువ్వోపాలి ఆ పిల్లొంక గట్టిగ సూసినావేటి? అబ్బో ఏమందం?... ఆ ముక్కూ మూతి... బుగ్గలు సన్నని నడుము ఒయ్యారమైన నడక సూత్తుంటే నిజంగా మతిపోవాల్సిందే... అసూంటి గుంటని పెళ్ళి సేసుకోవాలంటే.... పెట్టి పుట్టుండాలి. నువ్వు గనుక తలుసుకుంటే రేపటికల్లా ఆ మగేసుగాడి అడ్డు తొలగించీసి ప్రతిభను నీ కౌగిట్లో వాలిపోయేనాగా సేసుకోగలవు. ఒక్కపాలి మనసువెట్టి ఆలోశన సేసినావంటే దారి ఇట్టే దొరికేత్తది." అంటూ ప్రతిభ మీద ఆశలు కల్పించి మహేష్ మీదికి అస్త్రంగా విడిచిపెట్టాడు.

వాళ్ళిద్దరూ కొట్టుకుచస్తే ప్రతిభ తనదౌతుందనేది రమేష్ ఆలోచన.

రమేష్ మాటలు నిజమేనని నమ్మిన సురేష్, ప్రతిభ మీద ప్రేమను పెంచుకొని మహేషును కూడా పట్టుదలకు పోయి ప్రతిభను వదులుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పాడు. పైగా ఏం చేస్తావో నీ ఇష్టమొచ్చింది చేసుకోపో అని సవాలు కూడా విసిరాడు. దాన్ని అవమానంగా భావించిన సురేష్ విషయాన్ని తండ్రికి చెప్పడంతో ఫైటింగ్ సీన్ అనివార్యమై, రంగంలోకి గణేష్ ఎంటరయ్యాడు.

మరునాడే గణేష్ ఇంట్లో శేషాచలం...

"ఏందిరా నాయనా..! రేప్ కేసులో అరెస్టైన ఖైదీని కోర్టుకు హాజరుపరిచినట్టు మాటి మాటికీ జీపులో ఎక్కించుకుని లాక్కొస్తున్నారు. ఏంటో నా పరిస్థితిలా తయారైంది." అని మనసులో తనను తానే తిట్టుకుంటూ కూర్చున్నాడు.


"ఏం సంగతి పెద్దమనిషి మంచిగున్నవా?! ఏంసైన్మా దీస్తున్నవయా... ఓ ఎగురుడులేదు దునుకుల్లేదట... సైన్మాంటెట్లుండాలెవయా. కొట్టుకునుడూ తిట్టుకునుడూ మస్తుగుండాలెగనీ గిదేందివయా. తాటికల్లు తల్కాయ కూర లేని దావత్ జేశినట్టు అంత సప్పసప్పగుంటే ఎవల్గాన్తరు నీసైన్మా. గిట్లైతే నడ్వద్. మావోడు సైన్మాలల్ల కొట్లాట సీన్లంటే మస్తు పాయి రంజేత్తడు. గసోంటిది వాడు యాక్షనింగ్ జేశే సైన్మల్లే ఫైటింగులెల్వని ఒకటే నారాజ్ గావట్టిండు... జెర మావోని ముచ్చటేందో జూడరాదు. నీ సొమ్మేం ఊకెనే ఉంచుకోను గనీ. సైన్మ దీశినోళ్ళకు గదేదో అవార్డిత్తరట గద? ఆస్కారో గీస్కారో. గది నీకే ఇప్పిత్తపో!" అనుకుంటూ వెళ్ళిపోబోతుంటే...



## మాస్టర్ కార్టూనిస్టు



**చిరంజీవి శ్రియాన్ శ్రీరంగం** తన ఎనిమిదో ఏట నుంచి కార్టూన్లు చిత్రాలు వేయడం మొదలు పెట్టాడు. అంతే కాదు 11 సంవత్సరాల కల్లా తన కార్టూన్లతో ఒక పుస్తకాన్ని కూడా ముద్రించే స్థాయికి ఎదిగిపోయాడు. ఈ చిన్నారికి కార్టూనింగ్ పట్ల ఉన్న మమకారం ముమ్ముందు మరింత పట్టుదలతో, కృషితో, ఏకాగ్రతతో ప్రముఖ తెలుగు కార్టూనిస్టుల పక్కన నిల్చోవాలనీ హాస్యానందం అభినందిస్తూ భగవంతుడు అతనికి కావలసిన నైపుణ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటుంది.



"అది కాదండీ..." అంటూ ఏదో చెప్ప బోయాడు శేషాచలం.

"ఏఁ... ఇంగేం మాట్లాడక్. మావోడు ఖుషీగావాలె గంతే. నువ్వేంజేస్తవో దెల్వద్. ముందుగాల గాపని గానీయ్." అంటూ దమ్కీ ఇచ్చాడు గణేష్.

గత్యంతరంలేక మహేషుకు సురేషుకు మధ్యొక ఫైటింగ్ సన్నివేశం షూట్ చేయాలని నిశ్చయించుకుని గ్రూపులో అనౌన్స్ చేశాడు శేషాచలం.

షూటింగ్ స్పాట్లో విరగ్గొట్టడానికి, ముందే విరిగిపోయి మూలనపడిన మంచాన్ని బయ టకుతీసి, నాచురాలిటీని ఇసుమంతైనా కని పించకుండా పెళ్ళికూతుళ్ళను ముస్తాబుచేసే ప్రొఫెషనల్ బ్యూటీషియన్లాగా మంచాన్ని బాగుచేశాడు.

పగలగొట్టడానికి అపార్ట్మెంట్లపైన తాగిపడే సిన బీరుసీసాలను సేకరించాడు.

ఎగిరించడానికి పందెంకోన్నొకదాన్ని కొని వుంచి, వాటినెలా ఉపయోగించాలో ఏర్పాట్లు చేసుకుని కాలనీ రోడ్లోనే షూటింగ్ మొద లెట్టాడు.

"చూడు సురేష్..! ముందుగా మాంచి ఫైటింగ్ స్టిల్లొకటీ ఇవ్వాలోయ్. అదెలాగుం డాలంటే...

బాక్సింగ్ స్టైల్లో రెండు చేతులు పిడికిలి బిగించీ, కాలొకటి పైకిలేపీ, అల్లుడా మజాకా సినిమాలో చిరంజీవిలాగా ఫోజుపెట్టీ తన్న డానికి రెడీగా ఉన్నట్టుండాలని చెప్పి... రెడీ లైట్సాన్ రోల్ కెమెరా యాక్షన్." అన్నాడు శేషాచలం.

సురేష్, శేషాచలం చెప్పినట్లుగా ఫోజుపెట్టి, ఒక్కసారిగా కాలు పైకిలేపగానే ఉప్పొంగిన శరీరం వల్లనేమో ప్యాంటు మధ్యలోకి పుర్రు మని చిరిగింది. అప్పటికే కెమెరాలో చూస్తూ షూట్ చేస్తున్న ఏకనాథం అదిరిపడి...

"ఛీ!ఛీ... ఏమిటయ్యా ఈ దరిద్రం. నేనేదో అపూర్వమైన దృశ్యాలు చిత్రీకరిద్దామనుకుంటే నాచేత అడ్డమైన దృశ్యాలన్నీ షూట్ చేయిస్తు న్నారు. ఈ ముసలివయసులో ఏమిటయ్యా నాకీకర్మ!..." అని గట్టిగట్టిగా అరుస్తూ అక్కడ్నుంచి వెళ్ళిపోబోయాడు.

"ఓరి వీడి దుంపతెగా... వీడి బరువును బట్టలు కూడా భరించలేక పోతున్నట్టున్నాయి. బండరాళ్ళకు బట్టలేసినట్టుగున్నాడు బడు ద్దాయ్!" అని శేషాచలం లోలోపలే తిట్టు కుంటూ...

"ఏమండోయ్ ఏకనాథంగారూ!.. పాప మతను మాత్రం ఏంచేస్తాడు. మనిషి కాస్త దృఢంగా ఉన్నాడంతే. ఏదో అనుకోకుండా అలా జరిగిపోయింది... ఆమాత్రం దానికి మీరలా జడుసుకుంటారేం? ప్యాంటు మారిస్తే సరిపోతుంది... రండి!" అంటూ బ్రతిమాల సాగాడు.

"ఏందివయా డైరెక్టరు సారూ... గా పోటు వలు దించెటాయినెకు ఏంగావల్నట. ఏందో మస్తు గరంగావట్టిండు. ఉంటడా ఊడబీక్కొని పోతడాట్నా. సతాయిస్తె గాయినెను పనిలకెల్లి తీశిపారేశి ఇంకోన్ని బెట్టు." అని కాస్ట్యూమ్స్ మార్చుకునివస్తూ కసురుకున్నాడు సురేష్.

అన్నంత పని చేసినా చేయిస్తాడని అదిరి పడ్డారిద్దరూ. **(సశేషం)**



# దయ్యం రాజశేఖరం

కన్నోజు మనోహరాచారి,
79950 89083

**రాజశేఖరం చేసిన పాపాలకు యమధర్మరాజు అనేక శిక్షలు వేసిన అనంతరం చివరికి దయ్యంలాగ మారిపొమ్మని శాపం ఇచ్చాడు. ఆ రోజు నుండి దయ్యం రూపంలో రాజశేఖరం చెట్లు, పుట్టలు, అడవులు, శ్మశానాల్లో కాలం గడుపుతున్నాడు. బతికి వున్నపుడు తాను చేసిన పాపాలకు యమధర్మరాజు తనకు తగిన శిక్షనే విధించాడనుకుని రాజశేఖరం అపుడపుడు పశ్చాత్తాప పడుతుంటాడు**

ఎన్నెన్ని పాపాలు చేసాడు తాను... ఒకటా రెండా? ఎంతమందిని కిరాతకంగా చంప లేదు? బాంబుల ధాటికి చనిపోయినవారు కాకుండా, కాళ్ళు, చేతులు విరిగి హాహాకారాలు చేస్తున్నపుడు తానేమైనా చలించాడా?... వేట కొడవళ్ళతో మనుషులను నరికినపుడు ఆ కుటుంబాలు దిక్కులేనివారైతే తానేమైనా బాధ పడ్డాడా? అంతా తన నాయకుడు చెప్పినట్లు చేసాడు కాబట్టి వాడిచ్చే పది ఇరవై వేలకు తన జీవితాన్నే బలి ఇచ్చుకున్నాడు.

అసలు కట్టుకున్న భార్యను తాను ఎపుడైనా భార్యలాగా చూసుకున్నాడా? ఛీ! ఛీ!! ఎంత నికృష్టమైన జన్మ తనది? యమధర్మరాజు తనకు సరైన శిక్ష విధించాడు... తాను చేసిన అకృత్యాలకు మరణించి ఉండకపోతే మరెన్ని విధ్వంసాలకు తాను పాల్పడేవాడో...?

దయ్యం రాజశేఖరం స్మశానంలో ఒక చెట్టు మీద కూచుని తన గతాన్ని నెమరు వేసు కుంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. శ్మశానంలో అక్కడ కాలుతున్న శవాలను, చితిమంటలను చూస్తూ "ఏమిటీ తన జన్మ!" అనుకున్నాడు.

ఇదంతా ఎందుకోసం చేసాడు?... ఎవరి కోసం చేసాడు?ఇన్ని పాపాలు చేసింది కేవలం తన నాయకుడు చెప్పబట్టేగా! దయ్యం రాజ శేఖరం తనలో తానే కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

పెద్దగా బ్యాండు శబ్దం చేస్తూ ఆ శ్మశానం లోకి ఒక శవాన్ని తీసుకుని వస్తుండటంతో దయ్యం రాజశేఖరం ఆలోచనలకూ బ్రేక్ పడింది. శవాన్ని మోసుకుని వస్తున్నవారు తాను కూర్చున్న చెట్టు దగ్గరికే వస్తుండటంతో పరిశీలనగా ఆ వస్తున్న శవాన్ని చూసాడు దయ్యం రాజశేఖరం.




ఒక్కసారిగా అవాక్కయ్యాడు! మెడనిండా పూలదండలు వేసి ఉన్నప్పటికీ కొద్ది కొద్దిగా ముఖం బయటకు కనబడుతుండటంతో మరో సారి ఆ ముఖంలోకి పరిశీలనగా చూసాడు రాజశేఖరం.

అరే! వీడు వాడే!! కొండబాబు!... తన నాయకుడు. వీడేలా చచ్చాడు? వీడే పెద్ద నర హంతకుడు... కిరాతకుడు... మరి వీడేలా చచ్చాడు?... దయ్యం రాజశేఖరం ఆలోచనలు ఒక్కసారిగా స్పీడ్ అందుకున్నాయి.

శవాన్ని మోసుకునివచ్చిన వాళ్ళను, శవం వెంట వున్నవారిని చెట్టుపై నుండే పరిశీలనగా చూసాడు దయ్యం రాజశేఖరం.


శవాన్ని మోసుకుని వచ్చిన వారెవ్వరిలోను కొండబాబు చనిపోయాడని బాధ పడుతున్న ఆనవాళ్లు లేవు. శవాన్ని దించిన ఆ పదిమంది అక్కడవున్న కొండబాబు మూడో భార్య కొడు కుల వద్దకు వెళ్లి తమ కూలీడబ్బులు చెల్లించ మని అడగడం ద.రాజశేఖరం చూసాడు. కూలీ డబ్బులు చెల్లించడంతో... వారు వెనక్కు తిరిగి చూడకుండా వెళ్లిపోయారు.

అంటే...కొండబాబుని మోసుకొచ్చిన వారు ఎవరో కూలీలన్నమాట! వీడి శవాన్ని వీడి బంధువులు కూడా మోయలేదంటే వీడెంత పాపాత్ముడో ద.రాజశేఖరానికి అర్థమయింది.

దయ్యం రాజశేఖరం అక్కడ వున్న మనుషు ల్లోని మనసులోకి వెళ్లి చూసాడు.

'వీడితో వున్న రోజుల్లో ఒక ఫ్లాట్, నలభై కాసుల బంగారం తప్ప ఒరిగిందేమి లేదు... వీడి పీడా విరగడైనప్పటికీ వీడి సంపాదనలో మిగితా ఆస్తులని ఎలా రాబట్టుకోవాలి? రేపే లాయర్లతో మాట్లాడాలి' అనుకుంది మూడో భార్య.

మొదటి ఇద్దరు భార్యల... కొడుకులు కూతుళ్లు –'వీడితో మేము బాగానే సుఖ పడ్డాము.హోదా, పరపతి, కార్లు, రాజకీ యాలు, అమ్మాయిలతో షికారు, కాస్ట్లీ ఫోన్లు... అన్నీ అనుభవించినప్పటికీ వీడింకా కొన్ని రోజులు బతికి ఉంటే ఎన్నికల్లో సీటు దక్కించుకునేవాడిని.. మరికొన్ని బిజినెస్‌లు చేసేవాడిని...ఏదేమైనా రేపటికల్లా వీడి మిగితా ఆస్తులు ఎక్కడున్నాయో కనిపెట్టాలి...' ఇలా




ఎవరికివారు అనుకోవడం దయ్యం రాజశేఖరం గమనించాడు.

ఒక్కసారిగా కొండబాబు ఆలోచనల నుండి బయటకు వచ్చి తన గురించి ఆలోచించడం మొదలెట్టాడు దయ్యం రాజశేఖరం.

తాను ఇన్ని ఘోరమైన అరాచకాలకు పాల్పడింది వీడివల్లనే కదా!... అసలు వీడేలా చచ్చాడు?... ఎప్పుడూ మందిని చంపడం, హింసించడం తెలిసిన వీడికి చావు ఎలా వచ్చింది? దయ్యం రాజశేఖరం ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళిపోయాడు.

✦✦✦



కొండబాబు పెద్ద ఫ్యాక్షనిస్ట్. అదే ముసుగులో రాజకీయాలు నడిపాడు. అనేక బిజినెస్సుల్లో కోట్లు గడించాడు. తనను ఎదిరించాలనుకున్నవారిని ఏదో విధంగా మభ్యపెట్టడం, లేదంటే, పోలీసు కేసుల్లో ఇరికియ్యడం... వినకపోతే చివరికి వారిని మట్టుపెట్టడం కోసం ఒక గ్రూప్‌ను తయారు చేసుకున్నాడు.

ఆ గ్రూప్‌లో తాను ఒక మెంబర్.

పెళ్లి చేస్తే మారతాడని, తన తలితండ్రులు తనకు అందమైన అమ్మాయితో పెళ్లి చేసారు. అందరూ అదృష్టవంతుడన్నారు.

కొత్త కాపురం... హాయిగా రోజులు గడుస్తున్న సమయంలో తాను గతంలో చేసిన తప్పులను ఎత్తి చూపుతూ, బ్లాక్‌మెయిల్ చేస్తూ తన నుండి విడిపోకుండా కొండబాబు రాజశేఖరాన్ని తన దగ్గరే ఉంచేసుకున్నాడు.

జైలుకు వెళ్లడం... తిరిగి రావడం ... మళ్ళీ తప్పులు చేయడం... కొండబాబు ఇచ్చే పదీ ఇరవై వేలకు తాను అమ్ముడుపోవడం... ఇదీ తన దినచర్యగా మారిపోయింది. ఈ అరాచకాలతో తాను సాధించేదేముంది? శూన్యం!... భార్య పిల్లలకు న్యాయం చేయలేదు. పదిమంది తన వలన బాగుపడింది లేదు... వీడి పాపాల్లో భాగం పంచుకున్నందుకు పోలీస్ కాల్పుల్లో మరణించి ఇలా ఈ రోజు దయ్యం లాగా మారిపోవాల్సి వచ్చింది. పునర్జన్మ అంటూ ఉంటే మానవతావాదిలాగా బతకాలి అనుకున్నాడు రాజశేఖరం. ఉరఫ్ దయ్యం రాజశేఖరం.

బయట కొనే బాంబుల కన్నా తానే ఒక బాంబుల పరిశ్రమను పెట్టవచ్చునే ఆలోచనతో హైదరాబాద్ బయలుదేరిన కొండబాబు కారు మితిమీరిన వేగంతో రోడ్డు మీద ఆగివున్న లారీని బలంగా గుద్దుకోవడంతో కారులో వున్న కొండబాబు అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు.

కొండబాబు చెప్పినట్లు చేయడం వలన తనకు ఈ గతి పట్టింది. రేపు యమధర్మరాజు కొండబాబు గాడికి ఏ శిక్ష విధిస్తాడో చూడాలి అనుకుంటూ...

దయ్యం రాజశేఖరం అక్కడి నుండి మరో స్మశానంలోకి వెళ్ళాడు.

# నెల నెలా నవ్వుల వెన్నెల





ప్రపంచ **తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు **ప్రతి నెలా ఒక అంశం మీద** హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


| ఈ నెల అంశం- **బొకే!** |
|---|

నిర్వహణ: **లాల్**
























సువాసన
ఫ్లోరిస్ట్
నన్ను మా జాతి వాళ్ళ పక్కన పెట్టవోయ్!!
ఇలా ఎవరెవరో పక్కన పెడితే
నా స్టేటస్ ఏంకానూ!!?




WELCOME
TO
STATEHEAD
ఈ రీజియన్ హెడ్డు వారం రోజుల్నుండీ బ్రాంచు హెడ్డులందర్నీ
పీల్చిపిప్పి చేసి 'టార్గెట్ల'న్నీ ఒకటరోజులో చేయించి ఈ "బిజినెస్ బొకే"
రెడీ చేశాడు. ప్రమోషన్ కన్ఫర్మ్!!




హాస్యానందం పత్రిక ఇవాళ నన్ను కొని ప్రత్యేక వ్యంగ్య చిత్రకారునికి
అభినందన సభలో నా బొకేని అందిస్తారని తెలిసి నాకెంతో ఆనందంగా ఉంది
చెల్లీ...!!
నా కేంత
అదృష్టం
కూడాను....!!




మనం వాళ్ళ చెవుల్లో 'పూలు' పెడుతాం!
వాళ్ళు మన చేతుల్లో 'బొకేలు' పెడుతారు!!
హి హ్హి హ్హి...
సన్మాన సభ



అటు ప్లాస్టిక్‌తో పర్యావరణానికి చేటు
కాకుండా, ఇటు చాలా రోజులు మన్నికైన
అన్నీ కాయితం బొకేలే సార్, తీస్కోండి.



ఆగు తొందరపడకు అది ప్లాస్టిక్ బొకే.
నిజమైన పువ్వులుకాదు అక్కడ వాలి
నీ ఎనర్జీ వేస్ట్ చేసుకోకు



నన్ను అవినీతి కేసులో అరెస్ట్ చేసి జైలకి తీసుకెళ్తుంటే మనవాళ్ళంతా
నాకు బొకేలిస్తున్నారేంటి సెకెట్రీ... నేను జైలు నుండి విడుదలైన
తర్వాత కదా బొకేలు, దండలు వేసి ఘన స్వాగతం పలకాలి....
కారాగారం



కూర్పు: **పోపూరి విశ్వనాథ్, 9133197111**




| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | ■ | 4 |
| | ■ | | ■ | ■ | 5 | | |
| 6 | | | ■ | ■ | | ■ | |
| | ■ | 7 | 8 | | | 9 | ■ |
| 10 | 11 | ■ | | ■ | ■ | 12 | |
| ■ | | ■ | 13 | | ■ | | ■ |
| ■ | 14 | | | ■ | 15 | | |
| 16 | | ■ | ■ | 17 | ■ | | ■ |

## ఆధారాలు:

**అడ్డం:**

1. శ్రావణమాసంలో స్త్రీలాచరించేవ్రతం (6)
5. ప్రతి తరగతి చివరలో విద్యార్థులు ఎదుర్కొనేది సరిగాలేదు (3)
6. శివునికిష్టమైన దళం/ఆకు (3)
7. యథేచ్ఛ, ఇష్టమొచ్చినట్లు (5)
10. అవకాశం, సౌకర్యం తిరగబడింది (2)
12. గోడలమీద తిరిగే దీనికి శకునశాస్త్రం కూడా ఉంది (2)
13. ఇది చేయడమంటే అటునుంచి మొండి పట్టుదలగా ఉండడం (2)
14. గోడ పటిష్టంగా ఉండడానికి అడుగున లోతులో కట్టేది సరిగాలేదు (3)
15. ఉద్యోగం (3)
16. చివర చినిగిపోయిన చేతిగుడ్డ (2)
17. ....పోవడమంటే దుఃఖించడం, ఏడ్వడం (1)

**నిలువు:**

1. .....కట్టిపెట్టోయ్, గట్టిమేల్ తలపెట్టవోయ్ అన్నారు (5)
2. జైలు/ఆసుపత్రిలో ఉండి (పైకి) రావడం (4)
3. చాలాఎక్కువ తలక్రిందులైంది (4)
4. కష్టం (3)
8. పైకొచ్చిన గుర్తింపు చిహ్నం (4)
9. సంఘంలో మాట విలువ బాగా ఉంటే ఇలాంటారు (తలక్రిందులుగా) (5)
11. తదనంతరం ఆస్తిపాస్తులనుపంచే పత్రం (4)

## పదానందం–33 సమాధానం

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 పూ | రి | 2 జ | గ | 3 న్నా | థు | 4 డు | ■ |
| త | ■ | గ | ■ | షే | ■ | బు | ■ |
| 5 రే | వ | తి | ■ | 6 వి | దూ | ష | కు |
| కు | ■ | ■ | 7 తి | ■ | ■ | భో | ■ |
| 8 లు | 9 క | లు | క | లు | ■ | 10 వి | 11 రి |
| ■ | ర | ■ | మ | ■ | 12 ఖ | ■ | త్త |
| ■ | 13 పా | స | క | 14 స | జ్జ | 15 క | ■ |
| 16 చ | లం | ■ | ■ | త్తు | ■ | 17 ప్పు | తి |




Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# Brewstark®

## Clothing

Brewstark is a contemporary clothing brand offering premium shirts, jeans, trousers, and T-shirts crafted with uncompromised quality and style. Blending comfort, perfect fit, and dist inctive design, Brewstark creates versatile fashion for the passionate and ambitious



Plot # S17,
Road No.10C,
Jubilee Hills,
Hyderabad.




9000222411

Hasyanandam August-2026 RNI No. APTEL 08387/01/1/2003-TC


# S.K.P.V.V. DOKUPARTI UPENDRA ENGLISH MEDIUM HIGH SCHOOL

SKPVV INSTITUTIONS
Educating the Community since 1907

(Sponsored by S.K.P.V.V. Hindu High Schools' Committee)

9000529938 Jakkampudi, Vijayawada - 12.

CBSE Curriculum


## 6.5 Acres of World Class Institution @Jakkampudi

ADMISSIONS OPEN

1.5 acres for International Standards Construction
5 acres for Eco Environmental Education






KEY HIGHLIGHTS




- Concept Based Learning
- Smart Classrooms
- Modern Visualized Labs
- Arts & Sports
- Life Skills Learning
- Caring Campus
- Qualified Teachers
- Confidence, Creativity Scope
- Strong Values
- Skill - Based Learning
- Value - Based Education
- Safe & Supportive Environment
- Continuously Improve